కొదమసింహమై ఉరికి..



హర్డిల్స్ విభాగంలో క్రీడాకారిణి విన్యాసం

శ్యామలాసెంటర్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు రాజమహేంద్రవరం వేదికగా శుక్రవారం ప్రారంభమయ్యాయి. క్రీడా విన్యాసాలతో అథ్లెట్లు అబ్బురపరిచారు. 26 జిల్లాల నుంచి సుమారు వెయ్యిమంది క్రీడాకారులు ఈ ఆటల సంబరానికి తరలివచ్చారు.

1,00,714 మందికి పీఎం-కిసాన్

రాజమహేంద్రవరం కలెక్టరేట్: జిల్లాలోని 1,00,714 మంది లబ్ధిదారులకు పీఎం-కిసాన్ 18వ విడతలో రూ.20.14 కోట్ల సాయం అందనుంది. మహారాష్ట్రలో శనివారం ప్రధాని మోదీ పీఎం-కిసాన్ సొమ్ము విడుదల చేస్తారని జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి వీక్షించేలా పీఏసీఎస్‌ల వద్ద ఏర్పాట్లు చేశారు.



జిల్లాలో లబ్ధి ఇలా (రూ.లక్షల్లో)..

నియోజకవర్గం	లబ్ధిదారులు	అందించే సొమ్ము
అనపర్తి	15,421	308.42
రాజమహేంద్రవరం గ్రామీణం	5,581	111.62
రాజమహేంద్రవరం అర్బన్	81	1.62
రాజానగరం	22,994	459.88
గోపాలపురం	20,730	414.6
కొవ్వూరు	13,752	275.04
నిడదవోలు	16,403	328.06
జగ్గంపేట (గోకవరం మండలం)	5,752	115.04

తినగలమా.. ఈ ఆహారం

గోదావరి తీరమంటే ఆహ్లాదకర వాతావరణానికి పేరని.. అనేక రకాల సంప్రదాయ వంటకాలు పలకరిస్తాయని ప్రతీతి. మారుతున్న పోకడలకు అనుగుణంగా ఇబ్బడిముబ్బడిగా రెస్టారెంట్లు, హోటళ్లు, చిరు అంగళ్లు వెలుస్తున్నాయి. అంతవరకు సరే వీటిని కొద్దిరోజులుగా అధికారులు పరిశీలించినపుడు నిర్ఘాంతపోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి. విషపూరిత రసాయనాలు, నిల్వ మాంసం, కృత్రిమ రంగులు ఇబ్బడిముబ్బడిగా వాడకం బయటపడింది.

–ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, టి.నగర్

రుచిగా ఉండేందుకని..

చారిత్రక నగరం రాజమహేంద్రవరంలో నగరపాలక సంస్థ అధికారులు కొద్ది రోజులుగా ప్రధాన హోటళ్లు, బిర్యానీ పాయింట్లు, ఇతర కేంద్రాల్లో తనిఖీలు చేస్తున్నారు. బిర్యానీ రుచిగా ఉండేందుకు ప్రమాదకరమైన రసాయనాలు (క్యాన్సర్ కారకాలు) వినియోగిస్తున్నట్లు స్పష్టమైంది. రూ.300కు బిర్యానీ విక్రయించే ప్రధాన హోటళ్లు మొదలుకుని రూ.100కు విక్రయించే వీధివ్యాపారులు సైతం వినియోగిస్తున్నారు. ఎక్కువచోట్ల రెండు మూడు రోజులు నిల్వ ఉన్న మాంసం ఉంది.



అపరిశుభ్ర వాతావరణం మధ్యలో వంటశాల

- చారిత్రక నగరిలో దుస్థితి
- తనిఖీల్లో ప్రమాదకర రసాయనాలు, నిల్వ మాంసాల గుర్తింపు



ఓ రెస్టారెంట్‌లో గుర్తించిన నిల్వ మాంసం

కమిషనర్ కేతన్ గర్గ్ తెలిపిన వివరాల ప్రకారం..

- ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే రోడ్డులో ఉన్న పెద్ద హోటళ్లలో కాఫీ బేసిన్లను గత కొన్ని నెలలుగా శుభ్రం చేయలేదు.
- మూడో పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి గోదావరి గట్టుకు వెళ్లే మధ్యలో ఉన్న ఓ హోటల్‌లోని పన్నీరులో ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్నాయి. బిర్యానీలో టేస్టింగ్ సాల్ట్, రంగుల కోసం రసాయనాలు కలుపుతున్నారు. ఒక హోటల్‌లో నెల రోజులుగా ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన చికెన్ లభ్యమైంది.
- జాంపేట, ఆజాద్‌చౌక్ ప్రాంతాల్లోని కొన్ని హోటళ్లలో బిర్యానీతోపాటు పెరుగులో కూడా తెల్లగా ఉండేందుకు రసాయన పొడి కలుపుతున్నారు.
- అల్పాహార కేంద్రాల్లోని వంటశాలల్లో దీర్ఘకాలికంగా శుభ్రత లేదు. నాసిరకం నూనెలు వాడుతున్నారు. టీ దుకాణాల్లో కేవలం పౌండర్లతో వేడినీళ్లు కలిపి ఇన్‌స్టంటుగా ఇచ్చేస్తున్నారు. కాలం చెల్లిన ఇవి క్యాన్సర్ కారకాలు.
- వీఎల్ పురం, ఏవీఏ రోడ్డు, జేఎన్ రోడులో ఉన్న కొన్ని బిర్యానీ పాయింట్లలో రసాయనాలు కలిపిన పరిస్థితి.
- ఎటువంటి ప్యాకేజీ లేకుండా నేరుగా ఓ డ్రమ్ములో టీపొడి వేసి వాడుతున్న వారూ ఉన్నారు. ఎక్కడ తయారైందో? తుది గడువు ఎప్పటి వరకు ఉందో వివరాలు లేవు.

ఇప్పటి వరకు తనిఖీ చేసిన హోటళ్లు **79**
నోటీసులు జారీచేసినవి **78**
నమూనాల సేకరణ.. **4**
వసూలు చేసిన అపరాధ రుసుము.. **రూ.1.45 లక్షలు**
సీజ్ చేసిన హోటళ్లు **2**
తనిఖీలకు నియమించిన బృందాలు **6**

నగరంలో ఇలా..
జనాభా సుమారు **5 లక్షలు**
రిజిస్టర్డ్ హోటళ్లు **267**
అనధికారికంగా నిర్వహణ **135**



రంగులు వేసి చేసిన ఆహార పదార్థాలు

ఏ దుకాణమైనా ఆహార పదార్థాల తయారీలో ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తింపు ఉన్న సరకులే వినియోగించాలి. వంటశాల పరిశుభ్రంగా ఉంచాలి. స్టాంపింగ్(అధికారిక ముద్ర) ఉన్న చికెన్ మాత్రమే వాడాలి. 22 ఆహార శాలల్లో సేకరించిన నమూనాలను కాకినాడలోని జేఎన్‌టీయూ ల్యాబ్‌కు పంపించారు.

అరెస్టులకూ వెనుకాడం..

తొలుత పెద్ద హోటళ్ల నుంచి కింది స్థాయి వరకు ప్రణాళికాబద్ధంగా తనిఖీలు చేస్తున్నాం. ప్రధానంగా బిర్యానీలో ప్రమాదకర రసాయనాలు వినియోగిస్తున్నట్లు గుర్తించాం. చిరువ్యాపారులకు వీటిపై అవగాహన లేక వాడుతుంటే, పెద్ద హోటళ్లలోనూ అదే స్థాయిలో వినియోగం ఉంది. 22 చోట్ల సేకరించిన నమూనాలు ప్రయోగశాలకు పంపించాం. నివేదికలు వచ్చిన వెంటనే ఆయా హోటళ్లను సీజ్ చేసి నిర్వాహకులను అరెస్టు చేసేందుకూ వెనుకాడం.

-కేతన్‌గర్గ్, కమిషనర్, నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం



కార్తికం.. సిద్ధమేనా అన్నవరం

గత లోపాలు పునరావృతం కాకుండా కార్యాచరణ అవసరం

అన్నవరం, న్యూస్‌టుడే: కొద్దిరోజుల్లో పవిత్ర కార్తికమాసం ఆరంభం కానుంది. అన్నవరం సత్యదేవుని ఆలయంలో కీలక వేడుకలు ఈ మాసంలో జరగనున్నాయి. నవంబరు 15న గిరిప్రదక్షిణ, 13న తెప్పోత్సవం ఉంటాయి. మరోవైపు ఈ నెల 27 నుంచి సత్యదీక్షలు ప్రారంభమవుతాయి. గతంలో వేలాది భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న దృష్ట్యా తగిన ఏర్పాట్లుచేయాలని.. సమస్యలు పునరావృతం కాకుండా చూడాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నేడు సమీక్షా సమావేశం జరగనున్న దృష్ట్యా ఇప్పటినుంచే తగిన కార్యాచరణకు అడుగులు వేయాల్సి ఉంది.



గత ఏడాది గిరిప్రదక్షిణకు వచ్చిన భక్తజనసందోహం (పాత చిత్రం)

తోపులాటలు.. తాగునీటి ఇక్కట్లు

వైకాపా ప్రభుత్వ హయాంలో 2022 కార్తికంలో ఇక్కడి ఉత్సవాలకు ఏర్పాట్లలో అధికారులు విఫలమయ్యారు. క్యూలైన్లు సరిగా లేక తోపులాట చోటుచేసుకుంది. కొందరు చిన్నారులు, వృద్ధులు అస్వస్థతకు గురయ్యారు. భద్రతా లోపం కనిపించింది. వ్రతమండపాలు సరిపోలేదు. గత ఏడాది గిరిప్రదక్షిణకు 1.50 లక్షల మంది హాజరైతే తాగునీరు లేదు. దాతలు, దేవస్థానం సమకూర్చిన ఆహారం 20 శాతం మందికే సరిపోయింది. వైద్యసేవలు అంతంతమాత్రంగానే అందాయి.

ఇప్పుడు ఏం చేయాలి...

- రూ.200 శీఘ్రదర్శనం, ఉచిత దర్శనాలు, రూ.2 వేలు, రూ. 1,500 వ్రతాలకు ప్రత్యేక లైన్లు ఉండాలి.
- సుమారు 1.50 లక్షల వ్రతాలు జరుగుతాయని అంచనా. ఇందులో 70శాతం రూ.300 వ్రతాలే. అదనపు మండపాలు వేగంగా సిద్ధం చేయాలి. అన్ని ప్రదేశాల్లో తాగునీటి సౌకర్యాలు కల్పించాలి.
- వివాహ ముహూర్తాలు లేని సమయంలో సత్యగిరిపై ఉన్న విష్ణుసదన్ (వివాహ మండపాలు)ను, రత్నగిరిపై సీతారామసత్రం హాళ్లు డార్మెటరీగా వినియోగించాలి. గదులు ఖాళీ అయిన వెంటనే శుభ్రం చేసి మరొకరికి కేటాయించేలా ప్రణాళిక చేయాలి.
- పలుచోట్ల తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానపుగదులు అవసరం. భక్తులకు అదనపు బస్సులు ఉండాలి.
- దేవస్థానం ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ వద్ద స్నానపుగదులు, మరుగుదొడ్లు తాత్కాలికంగా ఏర్పాటు చేస్తే రైలు మార్గంలో వచ్చేవారికి సౌకర్యం.
- పర్వదినాల్లో భక్తులకు పులిహోర, దద్దోజనం పంపిణీ చేస్తారు. భోజన సౌకర్యం కల్పించడంపై కూడా దృష్టిసారించాలి.

సొసైటీ సిబ్బందిపై క్రిమినల్ కేసులు పెడతాం

సీతానగరం, న్యూస్‌టుడే: సొసైటీల్లో త్రీమెన్ కమిటీల సమయంలో భారీగా నిధుల దోపిడీ జరిగిన సీతానగరం మండలం వెదుళ్లపల్లి సొసైటీ సిబ్బందిపై క్రిమినల్ కేసులతో పాటు అరెస్టుకు రంగం సిద్ధం చేసినట్లు డీసీవో శ్రీరాములునాయుడు పేర్కొన్నారు. సొసైటీలో నిధుల గల్లంతుపై శుక్రవారం జిల్లా కేంద్ర సహకార అధికార బృందంతో కలిసి పలు సొసైటీలను పర్యవేక్షించారు. వెదుళ్లపల్లి సొసైటీలో రూ.46.23 లక్షలు గల్లంతుకు కారకులైన సీఈవో మట్టా సురేంద్రకుమార్, సేల్స్‌మెన్ భారతి, పోలేశ్వర్రావులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ ఏడాది మార్చిలోనే నిధుల గల్లంతు కావడం గుర్తించి వీరికి కొంత గడువు సమయం ఇచ్చినా రైతులకు సంబంధించిన సొమ్ము జమచేయలేదని ఈ సందర్భంగా అన్నారు. అన్ని సొసైటీల రికార్డులను తాము పరిశీలిస్తామని తెలిపారు. అనంతరం కాటవరం, మునికూడలి సొసైటీ రికార్డులను పరిశీలించారు. పర్యటనలో డీసీఏవో జగన్నాథరెడ్డి, ఆడిటర్ ముళ్లపూడి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కాటవరం సొసైటీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీసీవో, అధికారులు

పారదర్శకంగా మద్యం దుకాణాల వేలం

కొవ్వూరు పట్టణం: ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మద్యం దుకాణాల వేలం, ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారిణి సీహెచ్ లావణ్య తెలిపారు. ఆమె శుక్రవారం కొవ్వూరు ఎక్సైజ్ కార్యాలయాన్ని సందర్శించి దస్త్రాలను తనిఖీ చేసి కేసుల ప్రగతిపై ఆరా తీశారు. నూతన మద్యం విధానంలో భాగంగా జిల్లాలో 125 దుకాణాల ఎంపికకు ప్రకటన ఇచ్చామని, ఈనెల 11న రాజమహేంద్రవరంలో లాటరీ విధానం ద్వారా దుకాణాలను కేటాయిస్తారన్నారు.

మొత్తం 85 దరఖాస్తులు

దానవాయిపేట(రాజమహేంద్రవరం): జిల్లాలోని మద్యం దుకాణాల లైసెన్స్‌లకు గాను శుక్రవారానికి 85 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ లావణ్య తెలిపారు. 125 దుకాణాలకు నోటిఫికేషన్ ఇవ్వగా ఈ నెల మూడో తేదీన 74, శుక్రవారం మరో 10 దరఖాస్తులు వచ్చాయన్నారు. 9న దరఖాసుల స్వీకరణ ముగుస్తుంది. 10న పరిశీలన, 11న లాటరీ పద్ధతిలో లైసెన్స్‌లు అందిస్తామన్నారు.

ఊళ్లు.. అభివృద్ధి లోగిళ్లు

రహదారులు, కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు

ఉపాధిహామీ పథకంలో పనులు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం)

అయిదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ పట్టనుంది. గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎన్ఆర్ఈజీఎస్)లో దశలవారీ మౌలిక సదుపాయాలు మెరుగుపడనున్నాయి. ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో ఆయాచోట్ల చేపట్టాల్సిన పనులను గుర్తించారు. పంచాయతీ తీర్మానాల ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. తొలుత సీసీ రహదారులు, కాలువల అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చి పనులు చేపట్టనున్నారు.

గత వైకాపా ప్రభుత్వ పాలనలో గ్రామీణ ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. కనీస మౌలిక వసతులకు దూరమయ్యాయి. ముఖ్యంగా గ్రామీణ దారులు అధ్వానంగా తయారవడంతో ఆయా గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం రాగానే మౌలిక సదుపాయాల మెరుగుపై దృష్టి సారించింది. గ్రామసభల ద్వారా చేపట్టాల్సి పనులు గుర్తించి ఉపాధి హామీ పథకంలో చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది.

300 పంచాయతీల్లో...

జిల్లాలోని 300 గ్రామ పంచాయతీల్లో రూ.385.41 కోట్లతో మొత్తం 4,690 సీసీ రోడ్ల అభివృద్ధికి, రూ.358.88 కోట్లతో 4,949 సీసీ డ్రెయిన్ల అభివృద్ధికి ప్రతిపాదించారు. గ్రామీణ రహదారి పనులతో సమాంతరంగా డ్రెయిన్ల అభివృద్ధి పనులు కూడా చేపట్టాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారు. ఈ పనులకు ఉపాధి హామీ పథకంలో 60 శాతం వేతనాలు, 40 శాతం మెటీరియల్ కాంపోనెంట్ కింద నిధులు మంజూరు కానున్నాయి. ఈ నెల 14 నుంచి పనులు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. పరిపాలన ఆమోదం మేరకు ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా సీసీ రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధి పనులు పనులను చేపట్టనున్నట్లు చెబుతున్నారు.

ప్రతిపాదనలు, అంచనా వ్యయం వివరాలు ఇలా...

నియోజకవర్గం	పంచాయతీలు	సీసీ రోడ్లు	వ్యయం (రూ.కోట్లలో)	సీసీ డ్రెయిన్లు	వ్యయం (రూ.కోట్లలో)
అనపర్తి	41	1,011	77.55	900	61.92
రాజమహేంద్రవరం గ్రామీణం	21	947	99.87	418	26.02
రాజానగరం	71	1,091	111.99	1452	98.74
కొవ్వూరు	40	350	17.13	216	36.51
గోపాలపురం	57	341	31.29	324	42.98
నిడదవోలు	56	619	26.83	596	51.66
గోకవరం(మండలం)	14	331	20.75	1043	41.05

బీసీ కులగణన కోరుతూ 9న ధర్నా

దేవీచౌక్(రాజమహేంద్రవరం): బీసీ కులగణన వెంటనే చేపట్టాలని కోరుతూ ఈ నెల 9న విజయవాడ ధర్నా చౌక్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్ వెల్లడించారు. రాజమహేంద్రవరంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు. నాయకుడు సానబోయిన రామారావు మాట్లాడుతూ ధర్నాకు బీసీలు భారీగా తరలిరావాలని కోరారు.

టెట్.. తొలిరోజు 571 మంది హాజరు

శ్యామలాసెంటర్(రాజమహేంద్రవరం): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) తొలి రోజు శుక్రవారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. రాజమహేంద్రవరంలోని రాజీవ్‌గాంధీ లూథర్‌గిరి ఐయాన్ డిజిటల్ కేంద్రంలో జరిగిన ఈ పరీక్షకు 645 మందికి గాను 571 మంది హాజరయ్యారని డీఎస్ఈఓ కె. వాసుదేవరావు తెలిపారు. కొంతమంది అభ్యర్థులు ఎలక్ట్రానిక్ వస్తువులు, స్మార్ట్ వాచ్‌లు వెంట తీసుకువస్తున్నారని, అటువంటి వాటిని కేంద్రంలోకి అనుమతించమని పేర్కొన్నారు. డీవైఈఓ నారాయణ, డిప్యూటీ తహసీల్దారు రాజబాబు సందర్శించారు.

జిల్లా క్రైం డీఎస్పీగా రత్నం

దానవాయిపేట(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాష్ట్రంలో పనిచేస్తున్న పలువురు డీఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో డీఎస్పీ వెయిటింగ్‌లో ఉన్న కె.వి.రత్నంను తూర్పు గోదావరి జిల్లా క్రైం డీఎస్పీగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

రుణ మంజూరులో బ్యాంకర్లు చొరవచూపాలి: మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం కలెక్టరేట్, న్యూస్‌టుడే: నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని.. ఈ నేపథ్యంలో వివిధ రుణాల మంజూరు విషయంలో బ్యాంకర్లు చొరవ చూపాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్ల జిల్లా సంప్రదింపుల కమిటీ(డీసీసీ), జిల్లాస్థాయి సమీక్ష డీఎల్ఆర్‌సీ) సమావేశాలు కలెక్టర్ ప్రశాంతి అధ్యక్షతన శుక్రవారం జరిగాయి. మంత్రి మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, యువత, స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు రుణాల మంజూరు విషయంలో ప్రాధాన్యమివ్వాలని బ్యాంకర్లను కోరారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారని, ఆ క్రమంలో యువత, మహిళల స్వయం ఉపాధికి రుణాలు అందించడంలో సరళీకృతంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు.

రైతులకూ సాయం అందించాలి: కలెక్టర్

జిల్లాలో లక్ష మంది రైతులకు సీసీఆర్ కార్డులు జారీ చేశామని, ఆ మేరకు పంట రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రశాంతి కోరారు. భూ యాజమానులకు ఇచ్చేవి సాగు రుణాలుగా ఏవిధంగా పరిగణనలోకి తీసుకుంటారని ప్రశ్నించారు. పంట రుణాలు ఇచ్చేందుకు ముందుకురాని బ్యాంకుల నుంచి స్వయం సహాయక సంఘాల ఖాతాలను మార్పు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం యూనిట్స్ గ్రౌండింగ్ చేయాలన్నారు. మెప్మా ఆధ్వర్యంలో ప్రతిపాదించే మార్కెటింగ్ అధారిత రుణాలను పీఎం స్వనిధి, సఖి తదితర పథకాలకు వర్తింపజేసేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. యూబీఐ రీజనల్ హెడ్ ఎ.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో నిర్ణయించిన రుణ లక్ష్యం రూ.18,899 కోట్లకు గాను జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికానికి రూ.7,646 కోట్లు(40.45 శాతం) లక్ష్యం సాధించినట్లు తెలిపారు. సమావేశంలో నాబార్డ్ ఏజీఎం నాయుడు, ఆర్బీఐ ప్రతినిధి నాగ ప్రవీణ్, ఎల్‌డీఎం ప్రసాద్, బ్యాంకర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అమ్మకు నీరాజనం..

రాజమహేంద్రవరం సాంస్కృతికం: దేవీచౌక్ శ్రీబాలా త్రిపుర సుందరీదేవి అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాల్లో రెండో రోజు శుక్రవారం అమ్మవారి ఉత్సవమూర్తిని గాయత్రీదేవిగా అలంకరించి, త్రిలోక సుందరి పూజ చేశారు. ఆలయ ఆవరణలో భక్తులతో సామూహిక కుంకుమ పూజలు చేయించారు. రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు మంత్రికి వేదాశీస్సులు అందించి ఆశీర్వదించారు. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి జ్ఞాపిక బహూకరించారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి దుర్గేష్

దయ.. సహనం.. రాజసం

అమ్మను కొలిచే భాగ్యం అమోఘం. మనపుణ్యఫలముల సౌభాగ్యం. దయ, సహనం, రాజసం జట్టిపడే అలంకారప్రియం. దేవీ పాహిమాం అంటూ.. అంతటా శక్తి స్వరూపిణిని వేడుకున్న భక్త జనం. వెలిసిన శరన్నవరాత్రుల్లో రెండో రోజు శుక్రవారం ఆలయాలు, మండపాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచాయి. భవానీ మాలధారులతో అన్నిచోట్లా చల్లని తల్లి సన్నిధి. ప్రజలను [illegible] అమ్మవారిని వివిధ రూపాల్లో కొలువుదీర్చి దర్శనం కల్పించారు. అన్నింటా విజయం కోరుతూ దశమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి.

- న్యూస్‌టుడే బృందం


బొమ్మూరు నేతాజీనగర్‌లో అమ్మవారు


నిడదవోలు కోటసత్తెమ్మ



రాజమహేంద్రవరం: వి.టి కళాశాల వద్ద


శ్రీఐశ్వర్యలక్ష్మి పద్మావతి అమ్మవార్లకు కుంకుమార్చన


రాజమహేంద్రవరం: అక్షింతలతో కన్యకా పరమేశ్వరి అలంకరణ

అన్నదాత... ముగ్గురికి ప్రాణదాత

గ్రీన్ ఛానల్‌లో విశాఖకు అవయవాల తరలింపు


కల్యాణ్‌చక్రవర్తి (పాత చిత్రం)

మసీదు సెంటర్ (కాకినాడ), మండపేట (గ్రామీణం): ఆ రైతు తాను ఉన్నంత కాలం సాగు చేస్తూ పదిమంది కడుపు నింపారు. తాను లేకపోయినా మరో ముగ్గురికి ప్రాణదానం చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. వివరాల్లోకి వెళ్తే.. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన రైతు రెడ్డి కల్యాణ్‌చక్రవర్తి(51) రాజానగరం పరిధిలో ఈ నెల 2న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం కాకినాడ అపోలో ఆసుపత్రికి తరలించారు. బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. వారి సూచనలతో అతని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు అవయవాల దానానికి అంగీకరించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శుక్రవారం శస్త్రచికిత్స చేసి రెండు మూత్రపిండాలు, కాలేయం వేరు చేశారు. ఓ మూత్రపిండాన్ని విశాఖపట్నం అపోలో ఆసుపత్రికి, కాలేయాన్ని విశాఖలోని పినాకిల్ ఆసుపత్రికి వేర్వేరు వాహనాల్లో తరలించారు. రెండో మూత్రపిండాన్ని కాకినాడ అపోలోని మరో రోగికి అమర్చనున్నారు. అవయవాలను జీవన్‌దాన్‌లో భాగంగా విశాఖకు తరలించేందుకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో పోలీసులు గ్రీన్‌ఛానల్ ఏర్పాటు చేశారు.


అతుల్ జైన్‌కు సమస్యలను వివరిస్తున్న నిర్వాసితులు

కాలనీలు ఎప్పుడు పూర్తి చేస్తారో చెప్పండి

గోకవరం, దేవీపట్నం, న్యూస్‌టుడే: అద్దె ఇళ్లల్లో అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామని, తమకు కేటాయించిన కాలనీలు ఎప్పటికి పూర్తవుతాయో చెప్పాలంటూ శుక్రవారం నిర్వాసితులు [illegible] పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కాలనీల సందర్శనకు వచ్చిన పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈవో అతుల్ జైన్‌తో పాటు రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్‌కలెక్టర్ కల్పశ్రీల వాహనాలను [illegible] అడ్డుకున్నారు. [illegible] ట్టుకున్నా అధికారులు కనీసం తమ సమస్యలను పట్టించుకోవడం లేదంటూ వీరు మండిపడ్డారు. ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, సబ్‌కలెక్టర్ కల్పశ్రీలు వీరితో మాట్లాడి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. సుమారు అరగంట పాటు వీరు అడ్డుకోవడంతో అటుగా వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఎస్సై పవన్‌కుమార్ సిబ్బంది వారితో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు.

రంగరాయకు 66 వసంతాలు

వైద్య కళాశాలలో నేడు వేడుకలు



మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ రంగరాయ.. ఇదేదో సాదాసీదా పేరు కాదు.. ఒక బ్రాండ్. రాష్ట్రంలో ప్రముఖమైన వైద్య కళాశాలల్లో ఒకటి. 1958లో మొదలై వేల మంది వైద్యులను తయారుచేసింది. అందులో దేశ, విదేశాల్లో పేరొందిన వైద్యులు కూడా ఉన్నారు. విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి అనుబంధంగా ఈ కళాశాల పనిచేస్తుంది. ఏటా అక్టోబర్ 5న కళాశాల వార్షికోత్సం నిర్వహిస్తారు. శనివారం జరిగే వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు. అనుభవజ్ఞుల మాటకు, విద్యార్థుల ఆటపాటలకు.. ఇలా 66 ఏళ్ల జ్ఞాపకాలకు ఆర్ఎంసీ కళాశాల ఆడిటోరియం వేదికైంది.

ఈ రోజు కార్యక్రమాలు..

కార్యక్రమాల్లో భాగంగా కళాశాల వార్షిక నివేదిక ప్రవేశపెట్టనున్నారు. గతంలో కన్నా పెరిగిన వసతులు, నిర్మాణాలు, ఏర్పాట్లు తదితర అంశాలతో కళాశాల ప్రగతి గురించి వివరిస్తారు. వివిధ పోటీలు, సదస్సుల్లో పాల్గొని పతకాలు సాధించిన వారు, అకడమిక్స్‌లో బంగారు పతకాలు పొందిన వారి గురించి ప్రస్తావిస్తారు. పలు పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారికి బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ కింద బంగారు పతకాలు ఇవ్వనున్నారు. అన్ని రంగాల్లో మొత్తం 39 మంది వైద్య విద్యార్థులకు బంగారు పతకాలు, పురస్కారాలు అందించనున్నారు. అనంతరం విద్యార్థుల ఆటపాటలతో ముగింపు పలుకుతారు.

పేరు తీసుకురావాలి..



ఆర్ఎంసీలో నిపుణులైన వైద్యులు, అధ్యాపకులు ఉన్నారు. పూర్వ విద్యార్థుల సహకారం, చొరవతో కళాశాలకు మరిన్ని సదుపాయాలు సమకూరుస్తున్నాం. వైద్య వృత్తిలో వస్తున్న ఆధునిక మార్పులను గమనించాలి. కళాశాలకు, తల్లిదండ్రులకు విద్యార్థులు పేరు తీసుకురావాలి.

- డా.డీఎస్‌వీఎల్ నరసింహం, డీఎంఈ, ఆర్ఎంసీ ప్రిన్సిపల్

అన్ని ఏర్పాట్లు చేశాం..



కళాశాల వార్షిక దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎంబీబీఎస్ విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు అందిస్తాం. మెమోరియల్ బహుమతుల పంపిణీ జరుగుతుంది. ఇందులో భాగమవ్వడం ఆనందంగా ఉంది.

- డా.ఎ.విష్ణువర్ధన్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపల్

కొవ్వూరు లిటరరీ క్లబ్‌పై ప్రత్యేక పోలీసుల దాడి

● పైనుంచి పడి ఒకరి పరిస్థితి విషమం ● మరొకరికి గాయాలు


దాడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న లిటరరీ క్లబ్ ప్రతినిధులు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కొవ్వూరు లిటరరీ క్లబ్‌పై ప్రత్యేక పోలీసుల బృందం శుక్రవారం దాడి చేసింది. ఈ సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాల్లో ఒక సభ్యుడు కిందపడిపోయి తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరారు. క్లబ్ ఉద్యోగికీ గాయాలయ్యాయి. వివరాల ప్రకారం.. స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న క్లబ్‌లోకి సాయంత్రం 5.30 గంటల సమయంలో స్పెషల్ బ్రాంచ్‌కు చెందిన ఎస్సై, పది మంది పోలీసులు వచ్చి, వెనువెంటనే పైఅంతస్తుకు చేరుకోవడంతో అక్కడ రమ్మీ(పేకాట) ఆడుతున్న వారంతా నిశ్చేష్టులయ్యారు. రమ్మీ ఆడేందుకు తమకు అనుమతులున్నాయని వివరించే ప్రయత్నం చేసినా దాడులు కొనసాగించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆ సమయంలో పంతాడ సత్తిబాబు అనే సభ్యుడు కింద పడిపోవడంతో తల వెనుక తీవ్ర గాయమై అపస్మారక స్థితికి చేరుకున్నారు. క్లబ్‌లో పని చేసే కాగిత సుభాష్‌చంద్రబోస్ కాలుకు గాయమైంది. వీరిద్దరినీ హుటాహుటిన రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సత్తిబాబు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రత్యేక పోలీసు బృందం పి.వాసు మరో సభ్యుడిని తీసుకెళ్లి స్థానిక పోలీసు స్టేషన్‌లో అప్పగించడంతో క్లబ్ సభ్యులు నిరసనకు దిగారు. దీంతో కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్, సీఐలు పి.విశ్వం, ఎం.విజయ్‌బాబు సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు.


చికిత్స పొందుతున్న పంతాడ సత్తిబాబు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే రాజమహేంద్రవరానికి చెందిన స్పెషల్ బ్రాంచి సిబ్బంది క్లబ్‌పై దాడి చేసినట్లు డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. అక్కడ బాక్సులో ఉన్న క్వాయిన్స్, రూ.5,800 నగదు, పేకలు స్వాధీనం చేసుకున్నారన్నారు. దాడి సమయంలో అక్కడ 32 మంది ఉన్నారని, వారిలో ఇద్దరు దొరికినట్లు ప్రత్యేక పోలీసుల బృందం ఎస్సై ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసుస్టేషన్లో కేసు నమోదు చూశామన్నారు. ఒకరు కిందకు పడటంతో తలకు, మరో ఉద్యోగికి కాలికి గాయం కావడంతో వారిద్దరినీ చికిత్స నిమిత్తం ఆసుపత్రికి పంపించినట్లు తెలిపారు. రమ్మీ ఆడుకునేందుకు కోర్టు అనుమతులున్నా నిబంధనల ఉల్లంఘన వంటి అంశాలపై తనిఖీ చేసే అధికారం ఉందని ఆయన పేర్కొన్నారు..

దాడుల పేరిట ప్రాణాలు తీస్తారా..?

రమ్మీ ఆడుకునేందుకు హైకోర్టు అనుమతులు ఇచ్చినా ప్రత్యేక దాడులంటూ ప్రాణాలు తీస్తారా? స్పెషల్ పోలీసులు తనిఖీ చేయడానికి వచ్చారా? దౌర్జన్యానికి వచ్చారా? అంటూ లిటరరీ క్లబ్ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడి సందర్భంగా పంతాడ సత్తిబాబు పైఅంతస్తు నుంచి పడిపోలేదని, తోసేశారని వారు ఆరోపించారు. ఆయనకు ఏమైనా అయితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. క్లబ్ ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఉన్నాయని, ఆ ఫుటేజీ ఆధారంగా కోర్టును ఆశ్రయిస్తామన్నారు. పెద్ద వయస్సులో ఉన్న వారు కాలక్షేపం కోసం రమ్మీ ఆడతారని, ఇందుకు కోర్టు అనుమతి ఇచ్చిందంటూ సంబంధిత పత్రాలు చూపించారు. దాడులకు వచ్చిన వారు బల్లలను కాలితో తన్ని దుర్భాషలాడారని ఆరోపించారు. దాడికి కారకులైన వారిపై ప్రైవేటు కేసులు పెడతామని జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంతమణి రామకృష్ణ, ఉప్పులూరి సూరిబాబు, ఉప్పులూరి నానాజీ తదితరులు తెలిపారు.

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్


పరుగులో పోటీ పడుతున్న యువతులు

శ్యామలాసెంటర్ (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి క్రీడాకారులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పర్యాటక శాఖామాత్యులు కందుల దుర్గేష్ మాట్లాడుతూ జిల్లాలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు, శాప్ క్రీడా శిబిరాలను తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ నగరంలో క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తొలుత వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు ముఖ్య అతిథులకు గౌరవ వందనం సమర్పించారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో జరుగుతున్న ఈ పోటీల్లో భాగంగా తొలిరోజు రన్నింగ్, త్రోయింగ్, జంపింగ్ విభాగాల్లో హీట్స్ జరిగాయి. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆర్‌కే రామచంద్ర, జిల్లా ముఖ్య క్రీడా శిక్షకుడు డి.శేషగిరి, రాజమహేంద్రవరం అథ్లెటిక్స్ సంఘ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారుడి హైజంప్

వైద్య సేవల మెరుగుకు చర్యలు తీసుకుంటాం


ఆసుపత్రిలో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: వైద్యసేవలు మెరుగు పరచడానికి అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రెండు రోజుల క్రితం అనపర్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గర్భిణుల పట్ల వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఘటనపై శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, డీసీహెచ్ఎస్ పద్మశ్రీరాణి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. తాడి రామగుర్రెడ్డి పలువురు వైద్యులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. జరిగిన ఘటనపై వైద్యులను, వైద్య సిబ్బందిని వివరణ అడిగారు. బాధితుల వాదనకి, ఆసుపత్రి వర్గాలు చెప్పిన వివరణ భిన్నంగా ఉందని ఎమ్మెల్యే మండిపడ్డారు. గర్భిణుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరు స్పష్టంగా కనిపిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో ఉండే గైనకాలజిస్టులు డిప్యుటేషన్‌పై వెళ్లారని తెలిసిన ఎమ్మెల్యే వారి డిప్యుటేషన్ రద్దు చేసి, ఆసుపత్రికి పంపించాలని డీసీహెచ్ఎస్‌కు విజ్ఞప్తి చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతమైతే ఆసుపత్రి, ప్రభుత్వంపై ఉన్న విశ్వసనీయత దెబ్బతింటుందన్నారు. ఘటనకు సంబంధించిన విషయాలను జిల్లా కలెక్టర్‌కు చరవాణిలో వివరించి, విచారణకు ఆదేశించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ ప్రశాంతి విచారణకు ఆదేశాలిచ్చారని తెలిపారు. వైద్యులు కూడా వారి సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పేదవారందరికి ప్రభుత్వం భరోసాగా నిలుస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పద్మశ్రీ, తరుణ్, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పురపాలక సంఘ కార్యాలయం, మండపేట

ఆర్.ఓ.సి.నెం. 84/2022-A1 ది.03-10-2024.

బహిరంగ వేలం నోటీసు

మండపేట పురపాలక సంఘమునకు చెందిన ట్రావెలర్స్ బంగ్లా (19 షాపులు) నందు గ్రౌండ్ ఫ్లోర్ షాపు నెం. 2 మరియు మొదటి అంతస్తు నందు షాపు నెం. 1,2,5,6,7,8,9,10,11,12,13,15,16,17,20 ట్రావెలర్స్ బంగ్లా (12 షాపులు) నందు మొదటి అంతస్తు నందు షాపు నెం. 1,8 బురుగుంట చెరువు వద్ద మొదటి అంతస్తు నందు షాపు నెం. 1 (SC), 5,6,7,8, సర్దార్ శ్రీ వేగుళ్ళ వీర్రాజు సెంటర్ వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నందు మొదటి అంతస్తు షాపు నెం. 7 మున్సిపల్ పాత మార్కెట్ వద్ద గ్రౌండ్ ఫ్లోర్ నందు షాపు నెం. 4 మరియు మొదటి అంతస్తు నందు షాపు నెం. 4,5,7, మున్సిపల్ ఆఫీసు ఎదురుగా IDSMT వద్ద మొదటి అంతస్తు షాపు నెం. 4,24,25 (ST), 30 ,31, 42, గొల్లపుంత కాలనీ వద్ద షాపు నెం. 3లకు బహిరంగ వేలంలను గెజిట్ 14/2013, ది. 11-02-2013 నిబంధనల మేరకు మరియు జి.ఓ.ఎమ్.ఎస్.నెం. 56, ది. 05-02-2011, కౌన్సిల్ తీర్మానం నెం. 422, తేది:30-07-2024 మరియు కౌన్సిల్ తీర్మానం నెం. 463, తేది:30-09-2024లను ననుసరించి స్వాధీనపరచిన కాలము నుండి 3 సంవత్సరముల కాలమునకు లీజుకు ఇచ్చుటకు ది. 10-10-2024 వ తేదీ గురువారం ఉదయం గం॥ 11.00లకు పురపాలక సంఘ కార్యాలయము నందు బహిరంగ వేలం నిర్వహించబడును. మిగిలిన వివరములు ఆఫీసు పనివేళలలో రెవెన్యూ విభాగం నందు స్వయంగా తెలుసుకొనవచ్చును.

సం/- **కమిషనర్,** మండపేట పురపాలక సంఘం

టెండర్ ప్రకటన

అల్లూరి సీతారామరాజు జిల్లా, ఐ.టి.డి.ఎ., రంపచోడవరం మరియు చింతూరు పరిధిలో గల ఆశ్రమ పాఠశాలలకు, వసతి గృహములకు, గురుకుల మరియు ఏకలవ్య పాఠశాలలు మరియు కళాశాలలకు టెండరు ప్రక్రియ ద్వారా పాలు సరఫరా చేయుటకు టెండర్లు కోరబడుచున్నవి. ఆశ్రమ పాఠశాలలకు, వసతి గృహములకు, గురుకుల మరియు ఏకలవ్య పాఠశాలలు మరియు కళాశాలలకు టెండరు వేయువారు ఉపసంచాలకులు, (గి.సం)/గురుకులం సెల్, ఐ.టి.డి.ఎ., రంపచోడవరం వారి కార్యాలయం నుండి ఒక్కొక్క టెండరునకు రూ. 500/- నగదు చెల్లించి టెండరు షెడ్యూలును తేది:05-10-2024 నుండి 10-10-2024 ఉదయం 10.00 గంటల వరకు పొందవచ్చును. పూర్తి చేసిన టెండరు షెడ్యూల్స్ ది. 10-10-2024 తేదీ ఉదయం 10.00 గంటలలోపు ఉపసంచాలకులు, (గి.సం)/గురుకులం సెల్, ఐ.టి.డి.ఎ., రంపచోడవరం వారి కార్యాలయముల నందు ఉంచబడిన టెండరు బాక్సులలో వేయవలెను. అదేరోజు తేది:10-10-2024 మధ్యాహ్నం 3.00 గంటలకు టెండరుదారుల సమక్షములో సీల్డు వేసిన టెండర్లు తెరవబడును. పూర్తి వివరములకు ఉపసంచాలకులు (గి.సం.), ఐ.టి.డి.ఎ., రంపచోడవరం వారి కార్యాలయములో సంప్రదించవలెను.

సం/- **పథక నిర్వహణాధికారి**

ఐ.టి.డి.ఎ., రంపచోడవరం, అల్లూరి సీతారామరాజు జిల్లా

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్ళలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	12,000
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-15,500
కొత్త (పచ్చి) కాయ	14,000-14,500
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో


ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

హర్షకుమార్ భద్రతపై నివేదిక కోరిన ఎస్సీ కమిషన్

టి.నగర్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ భద్రతపై జాతీయ ఎస్సీ కమిషన్ నివేదిక కోరింది. ఈ మేరకు ఏపీ డీజీపీకి కమిషన్ డైరెక్టర్ సునీల్ కుమార్ కొద్ది రోజుల క్రితం లేఖ రాశారు. ప్రస్తుత పరిస్థితుల్లో జరుగుతున్న వివాదాలు నేపథ్యంలో భద్రత కల్పించాల్సిందిగా జూన్ 26న కమిషన్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందిందని ఆ లేఖలో పేర్కొన్నారు.

విషాదం మిగిల్చిన విహారం

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థిని దుర్మరణం


దీప్తి (పాతచిత్రం)

కోరుకొండ, నిడదవోలు, న్యూస్‌టుడే: రాజమహేంద్రనగరంలో స్నేహితులతో గడిపి సాయంత్రానికి ఇంటికి వస్తానన్న మాటలు ఆ తల్లిదండ్రుల చెవిలోనే ఉన్నాయి. కుమార్తె రాకకోసం గంపెడు ఆశలతో ఎదురుచూస్తున్న తాతా, నాయనమ్మ, కన్నవారికి పిడుగు లాంటి వార్త ఎదురయ్యింది. సరదాగా తిరిగేందుకు వచ్చిన ఆ యువతి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ ఘటన బూరుగుపూడి జంక్షన్‌లో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. నిడదవోలు మండలం పురుషోత్తపల్లి గ్రామానికి చెందిన జుజ్జవరపు వెంకటదీప్తి(18) సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఇంటికి వెళ్లే క్రమంలో నగరాన్ని చూడాలని శుక్రవారం 9 మంది స్నేహితులతో నాలుగు ద్విచక్ర వాహనాలపై వచ్చారు. సాయంత్రం కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి బయలుదేరారు. ఈ క్రమంలో బూరుగుపూడి జంక్షన్ సమీపంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న దీప్తి ఎదురుగా వస్తున్న టాటా ఏసీ వ్యాన్‌ను ఢీకొన్నారు. తలకు తీవ్ర గాయం కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. వెనక కూర్చున్న అనూషకు గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీప్తి తండ్రి వెంకటేశ్వరరావు వ్యవసాయం చేస్తారు. తల్లి గీత గృహిణి. అన్నయ్య బాల వంశీ పంజాబ్‌లోని ఎల్‌పీ యూనివర్సిటీలో బీటెక్ సీఎస్ఈ మూడో ఏడాది చదువుతున్నారు. ఇదిగో వచ్చేస్తున్నా అంటూ విగతజీవిగా మారిన దీప్తిని చూసి బంధువుల రోదనలు మిన్నంటాయి.

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లలో)



దేవీచౌక్: టమాట-54, వంకాయలు (నలుపు-30/గులాబీ-44/తెలుపు-30/దొమ్మేరు-44), బెండ-30, కాకర-34, బీర (పందిరి-42/36), దొండ-44, క్యారెట్-46/42, బీట్‌రూట్-32, గోరుచిక్కుళ్లు-38, దోస-30, ఆనబకాయ-25/26, చిక్కుళ్లు-60/దేశవాళీ-80, పచ్చిమిర్చి-22, బంగాళదుంపలు-32, ఉల్లిపాయలు-50/కొత్తవి-35.

సినిమాలు

దానవాయిపేట: శ్యామల, రాజా, వీఎస్ మహల్, అశోక, కుమారి, సూర్యప్యాలస్, అప్సర: దేవర. అనుశ్రీ: స్వాగ్, సూర్యమినీ: దక్షిణ, ఊర్వశి: సత్యం సుందరం, మేనక: మత్తు వదలరా-2, మిస్టర్ సెలబ్రిటీ(రెండు ఆటలు), శివజ్యోతి: రామ్‌నగర్ బన్ని, స్వామి: జోకర్, రంభ: కలి.

పాలనపై స్పందన వివరించా..

టి.నగర్: తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ శుక్రవారం అమరావతిలో మంత్రి లోకేశ్‌ను కలిశారు. వంద రోజుల పాలనపై ప్రజల్లో వస్తున్న స్పందన మంత్రికి వివరించానన్నారు.

చతుర్వేద మాత.. పంచముఖి రూపం



శ్రీశివ కామేశ్వరీ పీఠంలో గురుగ్రహ మండపారాధన

రాజమహేంద్రవరం సాంస్కృతికం: పురాతన క్షేత్రాలతో ఆధ్యాత్మిక నగరంగా భాసిల్లుతున్న గోదావరి తీరంలో దసరా సంబరాలు వైభవంగా జరుగుతున్నాయి. చతుర్వేద స్వరూపమైన గాయత్రీదేవి అయిదు ముఖాలతో సర్వమంగళకరంగా దర్శనమిచ్చారు. దేవీచౌక్ శ్రీబాలా త్రిపుర సుందరీదేవి అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాల్లో రెండో రోజు శుక్రవారం అమ్మవారి ఉత్సవమూర్తిని గాయత్రీదేవిగా అలంకరించి, త్రిలోక సుందరి పూజ చేశారు. పాకం గారెలు, పులిహోర నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ఆలయ ఆవరణలో భక్తులతో సామూహిక కుంకుమ పూజలు చేయించారు. శ్రీఉమా మార్కండేయస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం, పార్వతీ దేవికి కుంకుమార్చన జరిగాయి.



దేవీచౌక్‌లో గాయత్రీదేవిగా..

ఆలయ ఆవరణలోని వేదికపై అమ్మవారి ఉత్సవమూర్తిని మీనాక్షీదేవిగా అలంకరించి సహస్ర నామార్చన పఠించారు. నల్లమందు సందులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి విశేష హారతి, శ్రీఐశ్వర్యలక్ష్మీ పద్మావతి అమ్మవార్లకు పట్టు వస్త్రాలతో అలంకరించి కుంకుమార్చన నిర్వహించారు. వంకాయల వారి వీధిలోని అష్టలక్ష్మీ ఆలయంలో అష్టలక్ష్ములకు విశేష పూజలు జరిగాయి. ధాన్యలక్ష్మి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు జరిపించారు. గోదావరిగట్టున ఉన్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని అక్షింతలతో అలంకరించి కుంకుమార్చన నిర్వహించారు. సీతంపేట మాతృరూపిణీ సంస్థలో సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. సరస్వతీఘాట్‌లో అమ్మవారికి కుంకుమార్చన, గణపతి హోమం నిర్వహించారు.



దేవీచౌక్: సామూహిక కుంకుమ పూజల్లో భక్తులు



మార్కండేయస్వామి ఆలయంలో..



ఇన్నీసుపేట విజయదుర్గ ఆలయం వద్ద



కోటిపల్లి బస్టాండ్ వద్ద..



మంగళవారపుపేటలో..

మాం పాహి పరమేశ్వరి

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: నగరంలోని పలుచోట్ల మండపాల్లో అమ్మవారి విగ్రహాలు కొలువుదీరాయి. ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నారు. రెండో రోజు శుక్రవారం పలుచోట్ల అమ్మవారిని గాయత్రి దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. శుక్రవారం కావడంతో పెద్ద ఎత్తున మహిళలు కుంకుమ పూజలు చేశారు.



ఇన్నీసుపేటలో గాయత్రి అవతారంలో అమ్మవారు

మహిళా కానిస్టేబుల్‌కు కాంస్య పతకం



రోహిణిని అభినందిస్తున్న ఎస్పీ, ఏఎస్పీ

దానవాయిపేట: రాజమహేంద్రవరం పోలీసు శాఖలో సైబర్ విభాగంలో పీసీగా విధులు నిర్వర్తిస్తున్న ఆర్.రోహిణి అఖిల భారత పోలీస్ క్లస్టర్ ఛాంపియన్ షిప్ 2024-25 యోగ పోటీల్లో కాంస్య పతకం సాధించారు. ఆ మేరకు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమెను ఎస్పీ అభినందించారు. రోహిణి జాతీయ స్థాయిలో కాంస్య పతకం సాధించడం ఇది రెండోసారి అని, ఇదే స్ఫూర్తి కొనసాగించాలని ఎస్పీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎస్పీ అల్లూరి వెంకటసుబ్బరాజు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం బహూకరిస్తున్న సిబ్బంది

ర్యాలి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: ప్రసిద్ధ క్షేత్రం ర్యాలి జగన్మోహిని కేశవ స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన జయంతి వెంకటసూర్యనారాయణమూర్తి, సురేష్, రాజ్యలక్ష్మి, కార్తికేయ కుటుంబ సభ్యులు శుక్రవారం రూ.50,116 విరాళం అందించారు. వీరికి దేవస్థానం సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించి అభినందించారు.

ధ్రువపత్రం.. దరిచేరాలంటే కష్టం!

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు పొందడం.. నగరపాలక సంస్థలో ఓ ప్రహసనంగా మారింది. దరఖాస్తు చేసిన వారంతా రోజుల తరబడి పత్రాల కోసం తిరగాల్సిన పరిస్థితి. పత్రాల జారీకి సంబంధించిన వెబ్ సైట్ సర్వర్ సమస్యతో పాటు ఇతరత్రా కారణాలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ ఏడాది మే నెల నుంచి ఇలానే ఉందని.. సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



కార్యాలయం వద్ద క్యూ కట్టిన దరఖాస్తుదారులు

జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆధీనంలో ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్(సీఆర్‌ఎస్) వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయాలి. దాంతో ఎక్కడి నుంచైనా ఈ వెబ్‌సైట్ ద్వారా వివరాలు నమోదు చేసేందుకు గతంలో అవకాశం కల్పించారు. ఈ విధానం వల్ల ఎక్కడి నుంచైనా ధ్రువీకరణ పత్రం పొందవచ్చు. ఈ ప్రక్రియను కొంత మంది తప్పుడు పత్రాలు పొందారు. డిజిటల్ సంతకం, బార్ కోడును కాపీ చేసి తప్పుడు పత్రాలు సృష్టించారు. ఈ నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమై ఈ వెబ్‌సైట్‌ను పురపాలిక పరిధిలోకి తీసుకొచ్చింది. ఎక్కడ దరఖాస్తు చేస్తే అక్కడే ధ్రువీకరణ పత్రం పరిశీలించి మంజూరు చేసేలా మార్చారు. ఈ కొత్త విధానం అమల్లోకి వచ్చిన తర్వాత నుంచి వెబ్‌సైట్ సక్రమంగా పనిచేయక వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చలేకపోతున్నారు.

కాళ్లు అరిగేలా తిరుగుతున్నా..

మెరుగైన వైద్యం కోసం ఉమ్మడి జిల్లా పరిధి పలువురు నగరానికి వస్తుంటారు. వీరిలో కొందరు దురదృష్టవశాత్తూ మరణిస్తున్నారు. వీరితోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు గోదావరి తీరం వద్ద తనువు చాలిస్తుంటారు. ఇలా ప్రతీ రోజు నగర పరిధిలో 60 మంది మరణ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేస్తుంటారు. చనిపోయిన వారి వివరాలు సకాలంలో ఆన్‌లైన్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. తద్వారా గడువులోగా విచారణ చేసి ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాల్సి ఉంటుంది. వెబ్‌సైట్ సక్రమంగా పనిచేయకపోవడంతో వివరాలు పొందుపర్చలేకపోతున్నారు.

జనన పత్రానికీ అవస్థే

జనన విభాగంలోనూ ఇదే పరిస్థితి. రోజుకు 30 మందికి పైగా పత్రాల కోసం వస్తుంటారు. ధ్రువీకరణ పత్రం మంజూరు చేసే ప్రక్రియలో గడువు దాటితే మళ్లీ నోటరీ జత చేసి, సంయుక్త లేఖ నగర పాలక సంస్థకు సమర్పించాలి. ఈ ప్రక్రియతో కాలం గడిచిపోతుంది. ఉద్యోగులు, ఇతర దేశాల్లో ఉద్యోగాలు చేసేవారు పుట్టిన తేదీ తప్పుగా పడిన సందర్భంలో మరలా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. మరికొంతమందికి.. విదేశాలకు వెళ్లే క్రమంలో పాస్‌పోర్టుల పరిశీలనలో అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంలో జనన, మరణ విభాగంలో ఈ వివరాలు సరి చేయాల్సి ఉంటుంది. వెబ్ సైట్ ఆలస్యంగా ఉండటంతో పనులు ముందుకు సాగడం లేదు.

సమస్య అధిగమించేందుకు చర్యలు

వెబ్‌సైట్ ఆలస్యం కారణంగా ధ్రువీకరణ పత్రాల జారీ ఆలస్యమవుతోంది. దరఖాస్తుదారులు సహకరించాల్సి ఉంది. సమస్య అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– రవికుమార్, ఉప గణాంక అధికారి

నేడు, రేపు బస్సు పాసుల జారీ నిలిపివేత

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: సాఫ్ట్‌వేర్ ఆధునికీకరణ జరుగుతున్న కారణంగా ఈ నెల 5, 6 తేదీల్లో ఆర్టీసీ బస్సు పాసుల జారీ ప్రక్రియ నిలిపివేస్తున్నట్లు రాజమహేంద్రవరం డిపో మేనేజర్ ఎస్.కె.షబ్నం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల ఉచిత, రాయితీ పాసులు, దివ్యాంగ పాసులు, మంత్లీ సీజన్ టికెట్లు ఇలా అన్ని రకాల పాసుల జారీ నిలిపివేసినట్లు తెలిపారు. ఈనెల 7 నుంచి యథావిధిగా ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని కౌంటర్ వద్ద అన్ని రకాల బస్సు పాసుల జారీ చేస్తామన్నారు.

వేతన బకాయిలకు కొనసాగుతున్న సమ్మె

వి.ఎల్.పురం: వేతన బకాయిల కోసం గ్రామీణ నీటి సరఫరా విభాగం సత్యసాయి పథకం కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె రెండోరోజు శుక్రవారం కొనసాగింది. లాలాచెరువు బుస్సాస్టర్ వద్ద చేపట్టిన కార్మికుల సమ్మెకు సీఐటీయూ సంఘీభావం తెలిపింది. సీఐటీయూ ఉపాధ్యక్షుడు పవన్, జిల్లా కార్యదర్శి పూర్ణిమరాజు తదితరులు మాట్లాడుతూ.. సంబంధిత గుత్తేదారు ద్వారా వేతన బకాయిలు తక్షణం చెల్లింపునకు అధికారులు చర్యలు తీసుకోవాలని లేకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

నిత్యావసరాల ధరలను నియంత్రించాలి

వి.ఎల్.పురం: నిత్యావసర సరకుల ధరలను నియంత్రించాలని సరోజినీ నాయుడు మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు నల్లా భ్రమరాంబ డిమాండ్ చేశారు. రాజేంద్రనగర్‌లో జరిగిన మహిళా సంఘం సమావేశంలో ఆమె మాట్లాడుతూ బియ్యం, పప్పుధాన్యాలు, వంటనూనె, ఉల్లిపాయలు తదితర నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోయి సామాన్య, మధ్యతరగతి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఏపీటీఎఫ్ సభలకు ఆహ్వానం

శ్యామలా సెంటర్: విజయనగరంలో ఈనెల 6 నుంచి 8 వరకు జరిగే ఏపీ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) 80 వసంతాల సభకు హాజరు కావాలని కోరుతూ ఆహ్వాన పత్రాన్ని డీఎస్ఈఓ కె.వాసుదేవరావుకు శుక్రవారం సంఘ జిల్లా కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డేవిడ్ లివింగ్‌స్టన్, రాష్ట్ర కార్యదర్శి ఎ.ఉదయ బ్రహ్మం, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఛీఛీ.. ఇలాంటిచోటా తింటున్నది

● దారుణంగా వంట గదుల పరిసరాలు ● నగరంలో రెండు హోటళ్ల సీజ్

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: వంట గదుల్లో రోత పుట్టించే పరిసరాలు.. అపరిశుభ్ర ప్లాస్టిక్ డబ్బాల్లో ఆహార తయారీకి వినియోగించే వస్తువులు.. ఇదీ నగరంలో పలు హోటళ్లలో కనిపిస్తున్న దృశ్యాలు. నగరంలో పలుచోట్ల కల్తీ ఆహారం విక్రయిస్తున్నారని, ప్రధాన హోటళ్లలో సైతం ఇదే వ్యవహారం నడుస్తోందని కమిషనర్ కేతన్ గర్గ్ తెలియజేశారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రెండు వారాలుగా నగరంలో హోటళ్లలో తనిఖీలు చేపడుతున్న విషయం తెలిసిందే. కమిషనర్ కేతన్ గర్గ్ శుక్రవారం ఉదయం టిఫిన్ సెంటర్లను పరిశీలించారు. వంట గదుల్లో అపరిశుభ్ర వాతావరణంతో పాటు పదార్థాల తయారీకి కాలం చెల్లిన నూనెలను వినియోగిస్తున్నట్లు గుర్తించడంతో వాటిని సీజ్ చేశారు. మెయిన్ రోడ్డులో క్వాలిటీ సమోసా సెంటర్, కోరుకొండ రోడ్డులో ఉడుపి ఎంపీ టిఫిన్ సెంటర్‌ను సీజ్ చేసినట్లు కమిషనర్ ప్రకటించారు. వీటిల్లో సేకరించిన నమూనాలను జేఎన్‌టీయూకేకు పంపించామన్నారు.



వంటనూనె పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గర్గ్



వస్తువులు భద్రపరుస్తున్న డబ్బా అపరిశుభ్రంగా..

అప్పుల బాధతో బలవన్మరణం

రాజమహేంద్రవరం నేరవార్తలు: అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటనపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ కాశీ విశ్వనాథం వివరాల మేరకు.. హుకుంపేట డి-బ్లాక్‌కు చెందిన తవ్వాకుల సాయి(38)కి భార్య, ఇద్దరు పిల్లలు. నాలుగేళ్ల కిందట విభేదాల కారణంగా ఈ దంపతులు వేర్వేరుగా ఉంటున్నారు. నాటి నుంచి మద్యానికి బానిసైన సాయి అప్పులు చేశాడు. శుక్రవారం ఇంటి గదిలో ఫ్యానుకు ఉరేసుకుని ఉండడంతో స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పుల బాధతో తీవ్ర మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడినట్లుగా పోలీసు విచారణలో తేలింది. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పాదచారుడుకి గాయాలు

నారాయణపురం ప్రాంతానికి చెందిన ఎన్.నాగేశ్వరరావు గురువారం రాత్రి జైలు రోడ్డులో వెళ్తుండగా ద్విచక్ర వాహనం ఢీ కొంది. ఆ ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయం కావడంతో ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి వర్గాలు ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

బాణసంచా గోదాము సీజ్

రాజమహేంద్రవరం నేరవార్తలు: అధిక నిల్వలు కలిగిన ఉన్న ఓ దీపావళి బాణసంచా గోదామును బొమ్మూరు పోలీసులు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. పోలీసులు వివరాల మేరకు నామవరంలోని విజయలక్ష్మి ఫైర్ వర్క్ పేరుతో ఓ బాణసంచా గోదాము నిర్వహిస్తున్నారు. గోదాములో శుక్రవారం పోలీసులు తనిఖీలు చేశారు. లైసెన్స్ ప్రకారం 1,500 కేజీలు మాత్రమే నిల్వ ఉంచాలి. కాని 3,235 కేజీలు ఉండడంతో పోలీసులు ఆ సరకును సీజ్‌చేశారు. యజమాని ఎం.రామకృష్ణపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మద్యం విక్రయదారుడు అరెస్టు

వెంకటనగరం ప్రాంతానికి చెందిన టి.రాజు కాతేరు గ్రామ శివారులో మద్యం తరలిస్తుండగా మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద ఉన్న ఎనిమిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ధర తగ్గేదెలే!

రైతుబజార్ కిరాణా దుకాణాల్లో ఇదీ తీరు

న్యూస్‌టుడే, దేవీచౌక్

సన్‌ఫ్లవర్ నూనె.. రూ.132, కందిపప్పు రూ.150.. మినపగుళ్లు రూ.135.. ఇవీ బయట మార్కెట్లో సుమారుగా కొన్ని నిత్యావసరాల ధరలు.. వీటికి కొద్దోగొప్పో తగ్గింపు ధరలతో రైతుబజార్లో కిరాణా దుకాణాల్లో విక్రయాలు జరగాల్సి ఉన్నా ఆ ఊసే లేదు. పరిస్థితి చక్కదిద్దాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

వినియోగదారులకు కూరగాయలతోపాటు నిత్యావసర వస్తువులను సైతం బయట మార్కెట్ కంటే ఎంతో కొంత తక్కువ ధరకు విక్రయించే ఉద్దేశంతో రైతుబజార్లలో కిరాణా దుకాణాలు ఏర్పాటు చేశారు. వస్తువును బట్టి బయట దుకాణాల కంటే రూ.2 నుంచి రూ.5 తక్కువకు విక్రయించాల్సి ఉండగా ఈ దుకాణాల్లో ధరలు బయటవారితో సమానంగా ఉంటున్నాయి. దీంతో వినియోగదారులు నష్టపోవాల్సి వస్తోంది.

పట్టిక సైతం మార్చరు..

నగరంలో ఎనిమిది రైతుబజార్లు ఉండగా ప్రతిచోటా కిరాణా, ఆయిల్ దుకాణాలున్నాయి. రైతుబజార్లు ఏర్పాటుచేసిన కొత్తలో గృహమిత్ర పేరుతో దుకాణాలు నిర్వహించేవారు. టోకు ధరలకు రవాణా, ఇతర ఛార్జీలు వేసుకుని బయటకంటే తక్కువ ధరలకు నిత్యావసరాలు విక్రయించేవారు. 2000లో వీటిని కిరాణా దుకాణాలుగా మార్చారు. తర్వాత రైతుబజార్లకు ఆదరణ బాగా పెరగడంతో వీటికి వచ్చే వారి సంఖ్యా పెరిగింది. దీంతో దుకాణదారులు బయటవారితో సమానంగా అమ్మటం ప్రారంభించారు. దుకాణాల బయట ఏర్పాటుచేసిన ధరల పట్టికను సైతం మార్చడం లేదు. ధరలు, నాణ్యత విషయం ఎస్టేట్ అధికారులు కూడా పట్టించుకోవడం లేదు.



రైతుబజార్లలో ఉన్న కిరాణా, ఆయిల్ దుకాణాలు

రైతుబజారు పేరు	కిరాణా	ఆయిల్
నటరాజ్	1	1
గణేష్‌చౌక్	2	1
క్వారీ మార్కెట్	3	1
వై జంక్షన్	2	1
వీఎల్ పురం	1	–
శంభునగర్	1	1
మార్కెట్‌యార్డు	1	–

పర్యవేక్షణ ప్రత్యేక అధికారి ఏం చేస్తున్నట్లో?

రైతుబజార్లో కిరాణా దుకాణాల్లో ధరల పర్యవేక్షణకు ఒక ఎస్టేట్ అధికారిని ప్రత్యేకంగా నియమించారు. ఆయన వారానికి రెండు రెండురోజులు టోకు మార్కెట్‌కు వెళ్లి అక్కడి ధరలు, బయట ధరలను బేరీజు వేయాలి. బయట కంటే తక్కువగా రైతుబజారులో ధరలు నిర్ణయించాలి. దీనికోసం నిత్యం వినియోగించే వంట నూనెలతో సహా 27 రకాల వస్తువులతో ఒక ధరల పట్టికను రూపొందించారు. ఆ ప్రకారం అన్ని రైతుబజార్లకు పంపుతారు. దీనికి అనుగుణంగా దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన ధరల పట్టికలో మార్పులు చేయాలి. కానీ కొన్ని రైతుబజార్లలోని దుకాణదారులు ధరల పట్టికను పట్టించుకోవడం లేదు. బయట దుకాణాలతో సమానంగా విక్రయిస్తున్నారు.

మహిళా భద్రతకు ప్రత్యేక చర్యలు

రాజమహేంద్రవరం సాంస్కృతికం: మహిళల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని, అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన 'మీ భద్రత మా బాధ్యత' కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. మహిళల గౌరవ మర్యాదలకు ఎవరు విఘాతం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలు, బాలికల భద్రత కోసం 'మహిళా రక్షక్' కార్యక్రమాన్ని ఇటీవల ఎస్పీ ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, పోలీస్ అధికారిణి 'మహిళా రక్షక్' విధి విధానాల గురించి వివరించారు. ప్రిన్సిపల్ రాఘవ కుమారి, వైస్ ప్రిన్సిపల్ కె.ఎస్.రత్నకుమార్, విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు.



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి: సీపీఎం

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టాలని, ఉచిత ఇసుక విధానంలో అవాంతరాలను అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం నగర శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం శ్యామలా సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. పార్టీ నగర కార్యదర్శి బి.పవన్ మాట్లాడుతూ ఉచిత ఇసుక సామాన్యులకు అందుబాటులో ఉండేలా చూడాలని, అన్ని రీచ్‌ల్లో అర్హత కలిగిన బోట్స్‌మెన్ సొసైటీలకు అనుమతులు ఇవ్వాలని, ఇసుక బ్లాక్ మార్కెట్‌ను అరికట్టే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ధర్నాలో సీపీఎం నాయకులు

కొమ్మలు నరికేసి.. నిర్లక్ష్యంగా వదిలేసి..

విద్యుత్తు తీగల మీదకు వెళ్లకుండా నరికివేసిన చెట్ల కొమ్మలను గుట్టగా వేసి రోడ్డుపై నుంచి తొలగించకుండా వారాల తరబడి వదిలేయడంతో వాహనచోదకులు, స్థానిక నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. గోరక్షణపేట స్వాతి ముత్యం బిల్డింగ్ రోడ్డులో విద్యుత్తు లైన్ల క్లియరెన్స్ కోసమని రోడ్డు వెంబడి ఉన్న చెట్లకొమ్మలను 20 రోజుల కిందట సంబంధిత సిబ్బంది నరికివేశారు. నరికిన కొమ్మలను తొలగించకుండా వదిలేశారు. ఇటీవల దీనిలోకి చేరిన ఒక పామును ఇక్కడి వారందరూ కలిసి పట్టించినట్లు స్థానికుడు ఫణీంద్ర చెబుతున్నారు. రోడ్డుపై వదిలేసిన కొమ్మల గుట్టను తరలించాలని విద్యుత్తు సిబ్బందిని అడిగితే నగరపాలక సంస్థ పారిశుద్ధ్య సిబ్బంది తీస్తారని, పారిశుద్ధ్య సిబ్బందిని అడిగితే వాటిని విద్యుత్తు సిబ్బందే తొలగించాలని సమాధానాలు చెబుతున్నారే తప్ప ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



–న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

మేమున్నాం.. మీకు తోడుగా

మీ ప్రాంతంలో ప్రజా సమస్యలు ఇబ్బంది పెడుతున్నాయా? ప్రభుత్వం నుంచి సక్రమంగా అందాల్సిన లబ్ధి మీకు చేరలేదా? ఇలా ఏ సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. చిత్రాలను, వివరాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

సమస్యలపై సంప్రదించాల్సిన నంబరు

83282 39927
80089 02897

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

సాయి మందిరంలో శతచండీ యాగం

బిక్కవోలు: బలభద్రపురం ఆంధ్రాషిరిడి సాయి మందిరంలో అమ్మవారికి శుక్రవారం కుంకుమపూజలు నిర్వహించారు. ఆలయంలో నిర్వహిస్తున్న శతచండీ యాగం పురస్కరించుకుని పది మంది రుత్వికులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తుల కుంకుమపూజల అనంతరం బ్రాహ్మణ మహిళను అమ్మవారిగా భావించి సువాసినీ పూజ చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు పురుషోత్తమరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.


కుంకుమపూజ చేస్తున్న మహిళలు

వాడపల్లి వెంకన్న దర్శనానికి పాదయాత్ర

రాజానగరం: మండలంలోని నరేంద్రపురం నుంచి వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి 100 మంది భక్తులు పాదయాత్రగా శుక్రవారం బయలుదేరారు. సుమారు 80 కిలోమీటర్లు నడిచి శనివారం తెల్లవారుజామున స్వామి వారిని దర్శించుకుంటామని, ఏటా ఇలా పాదయాత్రగా వెళ్తామని భక్తులు తెలిపారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో భజన

బిక్కవోలు: సనాతన ధర్మం పరిరక్షణకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన పిలుపుమేరకు శుక్రవారం పందలపాకలో కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో భజన కార్యక్రమాలు కూటమి నాయకులు ఏర్పాటు చేశారు. శ్రీను, పెద బుజ్జి, శ్రీనివాస్, ఎల్.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.


కడియం: బాలాత్రిపుర సుందరిదేవిగా శ్రీఅపర్ణాదేవి


గాయత్రీదేవిగా గోకవరం దేవీచౌక్ అమ్మవారు


ముకుందవరంలో..

గాయత్రి మాత నమోస్తుతే..!

న్యూస్‌టుడే బృందం: వైభవంగా ప్రారంభమైన దసరా శరన్నవరాత్రి వేడుకలతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దుర్గమ్మను భక్తులు విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మము ఏలు దుర్గమ్మ.. నిను కొలెచె దుర్గమ్మ అంటూ భక్తిగీతాలాలపించారు. ● కడియపులంకలోని శ్రీహరిహర మహాక్షేత్రంలో కొలువైన శ్రీఅపర్ణా సమేత అనంతేశ్వరస్వామి ఆలయంలో బాలత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ● గోకవరం దేవీ చౌక్‌లో దుర్గాదేవి అమ్మవారు భక్తులకు గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. సొసైటీ మాజీ ఛైర్మన్ గాజింగం సత్తిబాబు ఆధ్వర్యంలో చండీహోమం జరిపారు. ● హుకుంపేట ఉమారామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో అమ్మవారిని సన్నజాజి పూలతో అభిషేకం చేశారు. ● అనపర్తి శాంతిపురంలోని శ్రీగణపతి, శ్రీ సరస్వతి సహిత శ్రీమహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో ఆలయ అర్చకుడు రామకృష్ణ శర్మ, పవన్‌శర్మలు ప్రత్యేక పూజలు చేశారు. ● బొమ్మూరు నేతాజీనగర్‌లో కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని గాయత్రి మాత రూపంలో అలంకరణ చేశారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు.


హుకుంపేట: పచ్చిపూల అలంకరణలో..


అనపర్తిలో గాయత్రి అవతారంలో అమ్మవారు

వెండి ఆభరణాల అలంకరణ

కడియం, న్యూస్‌టుడే: కడియపులంకలోని శ్రీఅష్టలక్ష్మీదేవి సమేత శ్రీపల్లాలమ్మతల్లి ఆలయ కమిటీ సభ్యులకు రైతు తిరుమలశెట్టి సూర్యభాస్కరరావు దంపతులు అమ్మవారి అలంకరణకు మూడు కేజీల వెండితో ప్రత్యేక ఆభరణాలు చేయించి అందించారు. భక్తుల సమక్షంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


అమ్మవారికి ఆభరణాలు అలంకరిస్తూ..

ముందుగానే కోతకు..!

బొండాలు రకం వరి పండించిన రైతుల హర్షం

బిక్కవోలు, న్యూస్‌టుడే: ఈ ఏడాది బొండాలు రకం వరి తొందరగానే కోతకు వచ్చింది. సాధారణంగా తొలకరిలో 120 రోజులకు ఈ వరి కోతకు వస్తుంది. కాని ఈ ఏడాది దాదాపు 20 రోజులు ముందుగానే కోతకు రావడంతో ఆ రకం వరి వేసిన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనపర్తి నియోజకవర్గంలో జులై నెలలో దాదాపు 200 ఎకరాల వరకు విత్తనాల కోసం రైతులు బొండాలు రకం వరి నాట్లు వేశారు. ఇవి ప్రస్తుతం వంద రోజుల లోపే కోతకు రావడంతో వారంతా పనులు మొదలు పెట్టారు.


ధాన్యం నాణ్యత పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

దాళ్వాకు విత్తనంగా..

అధిక దిగుబడి ఇచ్చే బొండాలు రకం విత్తనం దాళ్వాకు కావాలంటే తొలకరిలో నాటుకోవాలి. రెండు, మూడు ఎకరాల్లో సాగు చేపట్టే కౌలు రైతులు విత్తనాల కోసం బొండాలు రకాన్ని తొలకరిలో వేయలేరు. ధర ఎంత ఉన్నా దాళ్వానాట్లు కాలంలోనే విత్తనాలు కొంటారు. కొంతమంది రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు తొలకరిలో ఈ బొండాలు రకాన్ని పండిస్తారు. 75 కిలోల ధాన్యం బస్తాకు మద్దతు ధర దాదాపు రూ.1,700 పలుకుతోంది. విత్తనాల రూపంలో ఈ ధాన్యం విక్రయిస్తే బస్తా రూ.5,000 మించి ధర వస్తుంది.

డిమాండ్ ఎక్కువగా ఉంటుంది..

ఈ రకానికి డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. విత్తనాల కోసం 5 ఎకరాల్లో తొలకరిలో ఈ రకం నాటారు. ప్రస్తుతం ఇది కోతకు వచ్చింది. పంటకు ఎక్కడా తెగులు సోకలేదు. దాళ్వాలో ఈ రకం ఎకరానికి 60 బస్తాల వరకు దిగుబడి ఇస్తుంది. కాని 140 రోజులు తీసుకుంటుంది. ప్రస్తుతం అనుకూల కాలం కాకపోయినా ఎకరానికి 30 బస్తాలకు పైగా వస్తోంది. సన్న, చిన్నకారు రైతులు వచ్చి తమకు కావాలని అడుగుతున్నారు. **- దత్తుడు సుబ్బారెడ్డి, బలభద్రపురం**

ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వల్ల..

అధిక ఉష్ణోగ్రతల కారణంగా బొండాలు రకం ఈ ఏడాది ముందే కోతకు వచ్చింది. దీంతో పలు చోట్ల ఈ రకం పంటను పరిశీలించాం. సుబ్బారెడ్డి పొలంతోపాటు పలువురి పొలాల్లో ఎక్కడా ఎలాంటి తెగులూ లేక పోవడం గమనించాం. **- శామ్యూల్ జాన్, మండల వ్యవసాయ అధికారి**

ఎన్‌సీసీ విద్యార్థులకు పోటీలు

రాజానగరం, న్యూస్‌టుడే: గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ ప్రత్యేక జాతీయ సమైక్యతా శిబిరంలో భాగంగా శుక్రవారం క్యాడెట్లకు వివిధ రకాల పోటీలు నిర్వహించామని మేజర్ డిప్యూటీ క్యాంప్ కమాండర్ ఆసిఫ్ సాహెబ్ తెలిపారు. ఎన్‌సీసీ క్యాడెట్లకు వాలీబాల్, ఖోఖో, చిత్రలేఖనం, రంగోలి పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించామన్నారు. ఇందులో 17 రాష్ట్రాలకు చెందిన 300 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొంటున్నారని చిత్రలేఖనంలో దేశభక్తి, సమైక్యతా భావం ప్రదర్శించే విధంగా చిత్రాలు రూపొందించారని అన్నారు.


క్యాడెట్లు రూపొందించిన చిత్రలేఖనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ప్రోత్సాహకాలను పునరుద్ధరించాలని వినతి

కడియం, న్యూస్‌టుడే: గత పాలకులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులకు అందించాల్సిన ప్రయోజన ప్రోత్సాహకాలను రద్దు చేశారని, వాటిని తిరిగి పునరుద్ధరించాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు, ఆ సంఘ గౌరవ అధ్యక్షుడు చిలుకూరి శ్రీనివాసరావు సీఎం చంద్రబాబును కోరారు. ఆ మేరకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతల సంఘ అధ్యక్షుడు కైతేపల్లి దాసు, ప్రధాన కార్యదర్శి రామ్మోహనరావు, ఉపాధ్యక్షుడు యర్రా చక్రవర్తి, కార్యదర్శి కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్‌తో కలిసి ఆయన సీఎం చంద్రబాబును శుక్రవారం కలిశారు. గత తెదేపా హయాంలో ఏడాది సర్వీస్ పొడిగింపు, బదిలీల్లో 10 పాయింట్లు అందించేవారని సీఎం వివరించారు. అనంతరం విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి తమకు న్యాయం చేయాలంటూ వినతిని అందించారు.


సీఎం చంద్రబాబుకు వివరాలు తెలుపుతున్న శ్రీనివాసరావు తదితరులు

ఓఎన్‌జీసీ సేవలు గ్రామానికి అవసరం

బొమ్మూరు, న్యూస్‌టుడే: ఓఎన్‌జీసీ గోదావరి భవన్‌లో ఈడీ శాంతనూ దాస్‌తో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి శుక్రవారం సమావేశమయ్యారు. బొమ్మూరులో మహిళా ప్రాంగణం శిథిలావస్థకు చేరుకుందని తెలిపారు. ప్రాంగణంలో నూతన భవనం నిర్మించేందుకు సహకరించాలని, నియోజకవర్గంలో చెత్త తీసుకెళ్లేందుకు కొన్ని వాహనాలు సమకూర్చాలని ఆయన కోరారు. దానిపై యాజమాన్యం సానుకూలంగా స్పందించింది. అంతకుముందు ఎమ్మెల్యేకు శాలువా కప్పి మొక్కను అందజేశారు. కార్యక్రమంలో జీఎం రామారావు తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే గోరంట్లకు మొక్కను అందజేస్తున్న ఈడీ శాంతనూదాస్

కొనసాగుతున్న సమ్మె

వి.ఎల్.పురం : వేతన బకాయిల కోసం గ్రామీణ నీటి సరఫరా విభాగం సత్యసాయి పథకం కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె రెండోరోజు శుక్రవారం కొనసాగింది. లాలాచెరువు భాస్కర్‌నగర్ వద్ద చేపట్టిన కార్మికుల సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు తెలిపింది. సీఐటీయూ ఉపాధ్యక్షుడు పవన్, జిల్లా కార్యదర్శి పూర్ణిమ రాజు తదితరులు మాట్లాడుతూ.. సంబంధిత గుత్తేదారుడి ద్వారా వేతన బకాయిల తక్షణం చెల్లింపునకు అధికారులు చర్యలు తీసుకోవాలని లేకుంటే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

'సహకార వ్యవస్థను దెబ్బతీశారు'

సీతానగరం: వెదుళ్లపల్లి సొసైటీలో కొంతకాలంగా నిధుల గల్లంతుతో పాటు పట్టాదారు పాసుపుస్తకాలు ఇతరత్రా రికార్డులన్నీ కొంత మంది పట్టుకుపోవడం సొసైటీ ప్రతిష్ఠను దెబ్బతీసిందని భాజపా రాజానగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వీరన్నచౌదరి అన్నారు. రఘుదేవపురం డీసీసీబీ అధికారులను శుక్రవారం కలిసి రైతుల సొమ్ము గల్లంతుపై తీసుకున్న చర్యలేమిటో చెప్పాలన్నారు. సొసైటీలో ఎరువుల విక్రయాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని రైతుల నుంచి పలు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పార్టీ నాయకులు గూడపాటి జయరాం, మద్దాల కొండలరావు తదితరులు పాల్గొన్నారు

ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళం

అనపర్తి గ్రామీణం: ముఖ్యమంత్రి సహాయ నిధికి అనపర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు దాతలు ఇచ్చిన విరాళాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంత్రి నారా లోకేశ్‌కు శుక్రవారం అందజేశారు. ఉండవల్లిలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే దాతలు ఇచ్చిన రూ.6,37,700 విలువ గల చెక్కులను అందజేశారు.


ఉండవల్లిలో మంత్రి లోకేశ్‌కు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై అవగాహన

ఏ.వీ.ఏ రోడ్డు, న్యూస్‌టుడే: దొంగతనాలు అదుపు చేయడానికి రాజానగరం పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇన్‌స్పెక్టర్ ప్రసన్న వీరయ్య గౌడ్ ఆధ్వర్యంలో కొంతమూరు, కోలమూరు పరిసర ప్రాంతాల్లో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్)పై శుక్రవారం అవగాహన కల్పించారు. నివాసితులు ఊరెళ్లినప్పుడు రాజానగరం పోలీసు స్టేషన్లో వివరాలు తెలిపితే లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా రక్షణ కల్పిస్తామన్నారు.





సీతానగరం రహదారి విస్తరణ పనులకు మోక్షం

సీతానగరం: గత వైకాపా ప్రభుత్వంలో నిలిచిపోయిన రాజమహేంద్రవరం, సీతానగరం రహదారి విస్తరణ పనులను కూటమి ప్రభుత్వం శుక్రవారం ప్రారంభించింది. 2021లో సుమారు రూ.70 కోట్లతో అప్పటి వైకాపా ప్రభుత్వం చేపట్టిన విస్తరణ పనులు బిల్లుల్లో బకాయిలు ఉండడంతో గుత్తేదారుడు మధ్యలోనే నిలిపివేశారు. మునికూడలి, తొర్రేడు, బొబ్బిల్లంక, కాటవరం, రఘుదేవపురం, సీతానగరం తదితర గ్రామాల్లో రోడ్డు విస్తరణ పనులు ఎక్కడికక్కడ వదిలేయడంతో చోదకులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ విస్తరణ పనుల్లో రూ.కోట్ల బకాయిలతో పాటు ప్రస్తుతం రోడ్డు పూర్తిచేయాలంటే రూ.105 కోట్ల నిధులు అవసరమని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గత అసెంబ్లీ సమావేశాల్లో సమస్యను లేవనెత్తారు. రహదారి విస్తరణకు పెంచిన నిధులతోపాటు బకాయిల విడుదలపై ఎమ్మెల్యే స్పష్టత ఇవ్వడంపై గుత్తేదారులు ముందుకొచ్చి పనులు చేపట్టారు. కాగా తొర్రేడు-బొబ్బిల్లంక ప్రాంతాల్లో ముందుగా తారురోడ్డు పనులు చేపట్టామని ర.భ.శాఖ జేఈ జి.వీరన్నబాబు తెలిపారు. రఘుదేవపురం, సీతానగరం తదితర ప్రాంతాల్లో రహదారి విస్తరణకు భూసేకరణ సమస్యపై రైతులతో ఎమ్మెల్యే సమావేశమవుతున్నారని, సమస్య పరిష్కారమైతే ఆయా ప్రాంతాల్లో పనులు వేగవంతం చేయిస్తామని తెలిపారు.


బొబ్బిల్లంక వద్ద చేపట్టిన రహదారి పనులు



కలశాలతో మహిళల ఊరేగింపు

రాజానగరం, న్యూస్‌టుడే: వెలుగుబందలోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో 330 మంది మహిళా భక్తులు, భవానీ ఆధ్వర్యంలో కలశ ఊరేగింపు నిర్వహించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి పూజల అనంతరం కలశాలతో ఊరేగింపుగా వెళ్లారు. భక్తులకు కమిటీ అన్నసమారాధన నిర్వహించారు. దివాన్‌చెరువులోని ద్వారక జ్యోతిర్లింగ ఆలయ ప్రాంగణంలోని అన్నపూర్ణాదేవి గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రాజానగరంలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి రూ.20 వేలు విలువైన మకర తోరణాన్ని ఎం.శ్రీరామ్ దంపతులు శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సమర్పించారు.


కలశపూజలో భక్తులు

బాధ్యతా సంస్థ చేయూత

కడియం, న్యూస్‌టుడే: కడియంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన కోమటి ప్రభాకరరావు, రమణ కుటుంబాలను శుక్రవారం బాధ్యతా సేవాసంస్థ వ్యవస్థాపకుడు, వైకాపా రాష్ట్రకార్యదర్శి గిరజాల బాబు పరామర్శించారు. బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. అనంతరం సంస్థ సభ్యులతో కలిసి బాధితులకు నగదుతోపాటు దుస్తులు, వంట సామగ్రి, నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. సర్కార్ భాషా, కుసునూరి బాబులు, సుబ్బారావు, మలకల దొరబాబు, వాసు, బొమ్మిరెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.


సామగ్రిని అందిస్తున్న సేవా సంస్థ సభ్యులు

హరికథా సాహిత్యంపై పరిశోధన

రాజానగరం: నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో పీహెచ్‌డీ పూర్తి చేసిన వద్ది వెంకటరమణమ్మకు డాక్టరేట్ పట్టాను వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు శుక్రవారం వర్సిటీలో ప్రదానం చేశారు. కత్తుల కృష్ణభాగవతార్ అముద్రిత హరికథా సాహిత్యం-పరిశీలన అంశంపై ఆమె పరిశోధన చేశారని వీసీ తెలిపారు. పర్యవేక్షకులుగా డా.మోగంటి సుధామయి, సహ పర్యవేక్షకులుగా డా.తలారి వాసు మార్గదర్శకత్వం చేశారు. ఆమెను వీసీతో పాటు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, తెలుగు శాఖ అధ్యాపకులు డా.కేవీఎన్డీ వరప్రసాద్, ఇతర తెలుగు శాఖ అధ్యాపకులు అభినందించారు.

బహిరంగ మల విసర్జన చేస్తే జరిమానా

సుభద్రంపేట(రంగంపేట): బహిరంగ మలవిసర్జన వల్ల రోగాలు విజృంభిస్తున్నాయని, చేస్తే రూ.500 జరిమానా కట్టాలని రంగంపేట మండలం సుభద్రంపేట పంచాయతీ తీర్మానం చేసింది. దీంతో గురు, శుక్రవారాలు ఈ విషయాన్ని మైక్‌లో విస్తృత ప్రచారం కల్పించారు. నిబంధనలను అతిక్రమించిన వారి వివరాలు తెలిపిన వారికి రూ.500 బహుమానం అందిస్తామని సర్పంచి బూసి సాయితాతారావు ప్రకటించారు. ఇది మంచి పరిణామమని, సుభద్రంపేటను ఆదర్శంగా తీసుకుని ప్రతి గ్రామంలోనూ దీనిని అమలు చేయాలని ఇన్‌ఛార్జి ఈవో పి.వెంకటరత్నం తెలిపారు.


మైక్‌లో ప్రచారం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు ఎక్కడ?

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత ఇతర జిల్లాల నుంచి వచ్చి విధులు నిర్వహించిన తహసీల్దార్లు వారి సొంత జిల్లాలకు వెళ్లిపోయారు. అప్పటి నుంచి రాజమహేంద్రవరం గ్రామీణ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దారు, ఉప తహసీల్దారు, ఆర్ఐ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఆయా పోస్టులలో వేసిన ఉద్యోగులు విధులలో చేరకపోవడంతో ఇన్‌ఛార్జి తహసీల్దారు ఒక్కరి మీదే పని భారం పడింది. దాంతో క్షేత్రస్థాయి విచారణలు, కార్యాలయ పనులు సజావుగా సాగక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మూడు నెలలుగా ఇదే పరిస్థితి..

రాజమహేంద్రవరం గ్రామీణ తహసీల్దార్‌గా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ గంగవరంలో పనిచేస్తున్న సీహెచ్ శ్రీనివాసరావుని నియమిస్తూ జిల్లా కలెక్టరు ప్రశాంతి గతనెల 22న ఉత్తర్వులు జారీచేశారు. పదిరోజులు గడుస్తున్నా ఆయన ఇక్కడ విధులలో చేరలేదు. అల్లూరి జిల్లా వీర్‌పురం తహసీల్దారు కార్యాలయంలో ఉప తహసీలార్‌గా పనిచేస్తున్న ఎస్.సుబ్బారావుని నియమించి వెంటనే డిప్యూటేషన్‌పై పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు ఎల్ఎంసీ యూనిట్-1 కార్యాలయంలో స్పెషల్ డీటీగా నియమించారు. ఆయన కూడా ఇప్పటి వరకు కలెక్టరేట్‌లో పౌరసరఫరాల శాఖలో సీనియర్ సహాయకుడిగా పనిచేస్తున్న కె.వి ప్రసాద్‌ని ఆర్ఐగా నియమించి పౌరసరఫరాల శాఖలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యేవరకు విధులు నిర్వహించాలని ఆదేశాలు జారీచేశారు. ఇన్‌ఛార్జి తహసీల్దారు జె.రమ్యని పౌరసరఫరాలశాఖలో డీటీగా బదిలీ చేసినా తహసీల్దారుగా నియమితులైన శ్రీనివాసరావు విధులలో చేరకపోవడంతో ఆమె ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. ఇప్పటివరకు పనిచేసిన ఆర్ఐ వెంకటేష్ గెయిల్‌లో సీనియర్ సహాయకుడిగా బదిలీపై వెళ్లారు.

అప్పుల బాధతో బలవన్మరణం

రాజమహేంద్రవరం నేరవార్తలు: అప్పుల బాధ భరించలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటనపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ కాశీ విశ్వనాథం వివరాల మేరకు.. హుకుంపేట డి-బ్లాక్‌కు చెందిన తవ్వాటి సాయి(38)కి భార్య, ఇద్దరు పిల్లలు. నాలుగేళ్ల కిందట విభేదాల కారణంగా ఈ దంపతులు వేర్వేరుగా ఉంటున్నారు. నాటి నుంచి మద్యానికి బానిసైన సాయి అప్పులు చేశాడు. శుక్రవారం ఇంటి గదిలో ఫ్యానుకు ఉరేసుకుని ఉండడంతో స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పుల బాధతో తీవ్ర మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడినట్లుగా పోలీసు విచారణలో తేలింది. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాణసంచా గోదాము సీజ్


అధిక నిల్వలు కలిగి ఉన్న ఓ దీపావళి బాణసంచా గోదామును బొమ్మూరు పోలీసులు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు నామవరంలోని విజయలక్ష్మి ఫైర్ వర్క్స్ పేరుతో ఓ బాణసంచా గోదాము నిర్వహిస్తున్నారు. గోదాములో శుక్రవారం పోలీసులు తనిఖీలు చేశారు. లైసెన్స్ ప్రకారం 1,500 కేజీలు మాత్రమే నిల్వ ఉంచాలి. కాని 3,235 కేజీలు ఉండడంతో పోలీసులు ఆ సరుకు సీజ్‌చేశారు. యజమాని ఎం.రామకృష్ణపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీ సీజ్

గోకవరం: పోలవరం గట్టు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు తహసీల్దార్ సరస్వతి తెలిపారు. బాజాల్‌పేట సమీపంలో పోలవరం గట్టు నుంచి శుక్రవారం అక్రమంగా మట్టిని తరలిస్తుండగా రెవెన్యూ సిబ్బంది పట్టుకున్నారు. ప్రస్తుతం లారీని సీజ్ చేసి తగినచర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

ప్రకృతి సేద్యంతో నాణ్యమైన దిగుబడులు

గోకవరం: ఏవిధమైన రసాయనిక ఎరువులు వినియోగించకుండా చేపట్టే ప్రకృతి సేద్యంతో నాణ్యమైన దిగుబడులు సాధ్యమవుతాయని ప్రకృతి వ్యవసాయం ఎం.టీ దేవి తెలిపారు. పెంటపల్లి గ్రామంలో ప్రకృతి సాగు చేస్తున్న రైతులకు డ్రోన్ ద్వారా కషాయాలు పిచికారీ చేయడంపై అవగాహన కల్పించారు. దీంతో శుక్రవారం సామూహికంగా రైతులు ముందుకు రావడంతో సుడిదోమ, పచ్చపురుగు నివారణకు కషాయాలను డ్రోన్ ద్వారా పిచికారీ చేయించారు.



డ్రోన్ పిచికారీపై రైతులకు అవగాహన

నేడు, రేపు బస్సు పాసుల జారీ నిలిపివేత

వి.ఎల్.పురం: సాఫ్ట్‌వేర్ ఆధునికీకరణ జరుగుతున్న కారణంగా ఈ నెల 5, 6 తేదీల్లో ఆర్టీసీ బస్సు పాసుల జారీ ప్రక్రియ నిలిపివేస్తున్నట్లు రాజమహేంద్రవరం డిపో మేనేజర్ ఎస్.కె.షబ్నం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల ఉచిత, రాయితీ పాసులు, దివ్యాంగ పాసులు ఇలా అన్ని రకాల పాసుల జారీ నిలిపివేసినట్లు తెలిపారు. ఈనెల 7 నుంచి యథావిధిగా ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని కౌంటర్ల వద్ద అన్ని రకాల బస్సు పాసులు జారీ చేస్తామన్నారు.

పోటాపోటీగా వాలీబాల్

రాజానగరం, న్యూస్‌టుడే: తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం శివారు దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సీబీఎస్ఈ క్లస్టర్-7 బాలుర వాలీబాల్ పోటీలు రెండోరోజు హోరాహోరీగా సాగాయి. అండర్-14, 17, 19 విభాగాల్లో లీగ్ దశలో శుక్రవారం ఈ జట్లు విజయం సాధించాయి.


తలపడుతున్న గుంటూరు - తెలంగాణ విద్యార్థులు

విజేతల వివరాలు ఇలా..

అండర్-14 విభాగంలో నవభారత్ పబ్లిక్ స్కూలు, యూనిసెంట్ స్కూలు(తెలంగాణ), నంద్యాల పబ్లిక్ స్కూలు(కర్నూలు), అకార్డ్ స్కూలు(తిరుపతి). ✦ అండర్-17 విభాగంలో రాక్‌ఉడ్ స్కూల్(తెలంగాణ), శ్రీస్వామినారాయణ స్కూల్(హైదరాబాద్), ఎస్‌డీఆర్ స్కూల్(కర్నూలు), శ్రీప్రకాష్ విద్యానికేతన్(పాయకరావుపేట). ✦ అండర్-19లో డా.ఏఎల్ ప్రసాద్ పబ్లిక్ స్కూలు, దిల్లీ పబ్లిక్ స్కూలు(వరంగల్), ప్రాచీన గ్లోబల్ స్కూల్(హైదరాబాద్), శ్లోక ఏ బిర్లా స్కూల్(తిరుపతి).

SUBSTITUTED SUMMONS BY WAY OF PAPER PUBLICATION

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL VISAKHAPATNAM

O.A.NO.864/2021

Summons under Sub-Section (4) of Section 19 of the Act, read with Sub-rule (2A) of Rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993.

BETWEEN:

State Bank of India, Dowleswaram branch, East Godavari District Represented by its Chief Manager ...Applicant

AND

SMT. Vundavalli Bharathi Devi & Others... Defendants

ADDRESS OF DEFENDANT

1. **KUM.VUNDAVALLI BHARATHI DEVI. D/o. VUNDAVALLI SURYANARAYANA D.No. 19-171, Agraharam, Dowlaiswaram-533125, East Godavari District.**
2. **ROBIN KANTH UPADHYAY, FATHER'S name not known to applicant Medicare or Mart Loooks Booth, FFA 37, 2ND Flor, Omaxe Park Plaza, Indirapuram, Ghaziabad 201 014, Uttar Pradesh.**
3. **ICICI BANK, Mahiuddinpur Kanawni Branch, Rep by its Branch Head, Exotica Elegance Arcade, 9A, Mall Road, Mahiuddin Pur Kanawni, Near Delhi Public School, Indirapuram, Ghaziabad, Uttar Pradesh**

SUBSTITUTED SUMMONS BY WAY OF PAPER PUBLICATIONS

WHEREAS,O.A.864/2021 was listed before Honourable Presiding officer Registrar on 07-10-2024

WHEREAS this Honourable Tribunal is pleased to issue summons / notice on the said Application under Section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of Rs.24,12,513-00/- (application along with documents etc., to be handed over at the time of appearance of defendants.)

In accordance with Sub-Section (4) of Section 19 of the Act, you, the Defendants are directed as under:-

(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) You are strained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the Original Application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the tribunal.
(v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit of each sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Presiding Officer/Registrar on 07-10-2024 at 10.30 A.M. failing the application shall be heard and decided in your absence.

Given under my hand and the seal of this Tribunal on this 9th day of September-2024

Signature of the Officer Authorized to issue, summons

కొవ్వూరు

•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

ఉద్యోగ మేళాలో 28 మంది ఎంపిక

నిడదవోలు, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ సంయుక్తంగా నిడదవోలు ఎస్వీఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగమేళాలో 28 మందికి అవకాశాలు దక్కాయి. శుక్రవారం ఈ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో 5 సంస్థలు పాల్గొన్నాయని, 89 మంది నిరుద్యోగ యువత పాల్గొనగా 28 మందికి ఉద్యోగ అవకాశాలు దక్కాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారి హరీష్‌చంద్రప్రసాద్, కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ కె.జ్యోతి, ఏడీఎస్‌డీవో పెరుమాళ్, స్కిల్ హబ్ ఇన్‌ఛార్జి ఎస్.నాగేశ్వరరావు, స్కిల్ కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏకపక్ష పాలసీలను ప్రవేశపెట్టడం సరికాదు



ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఏఓఐ ప్రతినిధుల నిరసన

కొవ్వూరు పట్టణం: జీవిత బీమా రంగంలో ఏకపక్షంగా నూతన పాలసీలను ప్రవేశ పెట్టడం సరికాదని ఎల్ఐసీ ఏఓఐ కొవ్వూరు డివిజన్ అధ్యక్షుడు వై.విశ్వేశ్వరరావు అన్నారు. కొవ్వూరు జీవిత బీమా కార్యాలయం వద్ద ఏజంట్లు శుక్రవారం నిరసన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ పాలసీ రుణంపై వడ్డీ తగ్గించాలన్నారు. కొత్త పాలసీలపై ఐక్యకార్యాచరణ సమావేశం నిర్వహించాలని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. బ్రాంచి కమిటీ అధ్యక్షుడు కె.మల్లికార్జున్, కార్యదర్శి టి.శ్రీనివాస్, కోశాధికారి రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు వి.సత్యనారాయణ, భోగరాజు శేషుకుమార్, సభ్యులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా



సమస్య: రెండు నెల కిందట వచ్చిన భారీ వర్షాలు, గాలులకు కొవ్వూరు గోష్పద క్షేత్రంలోని రావి వృక్షం కొమ్మలు విరిగి పడ్డాయి. వృక్షం చుట్టూ వలయంగా ఉన్న అరుగు ఒకవైపు ధ్వంసమైంది. ఈ వృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేయడం, ఈ అరుగుపై కూర్చుని సేద తీరడం భక్తులకు అలవాటు. మహిళలు దుస్తులు మార్చుకునే తాత్కాలిక గదులను ఏర్పాటు చేయాలి. - వి.ప్రసాద్, కొవ్వూరు

సమాధానం: వరదలతో రేవులో చేరిన ఒండ్రును తొలగించాం. దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులను అందుబాటులోకి తెస్తాం. ధ్వంసమైన అరుగుకు మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం.

- టి.నాగేంద్రకుమార్, పురపాలక కమిషనర్ - న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

సమస్య: మండలంలోని దమ్మెన్ను, లంకలకోడేరు రహదారి గుంతలమయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరమ్మతులు చేయించాలి. - జి.సత్యనారాయణ, దమ్మెన్ను

సమాధానం: రహదారిని పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం.

- సీహెచ్ శ్రీనివాసు, ఏఈ, ర.భ.శాఖ - న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

పూడిక తొలగించారు..!



అన్నదేవరపేటలో ఎస్సీ తదితర కాలనీల్లోని డ్రెయిన్లను శుభ్రం చేశారు. ఎస్సీ కాలనీలో డ్రెయిన్ పూడుకుపోవడంతో మురుగు కదలడం లేదు. దుర్వాసన వస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై గత నెల 30న 'మేమున్నాం... మీకుతోడుగా'లో ప్రచురితమైన సమస్యకు పంచాయతీ కార్యదర్శి వీరన్న స్పందించి సిబ్బందితో పనులు చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. - న్యూస్‌టుడే, తాళ్లపూడి

స్పందనకు వందనం

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: 80085 74497 నిడదవోలు: 80085 74501, గోపాలపురం: 91212 29084

చెత్త పన్ను భారం తొలగింది..!

హర్షం వ్యక్తం చేస్తున్న పట్టణ వాసులు

న్యూస్‌టుడే, నిడదవోలు, కొవ్వూరు

ఎట్టకేలకు పట్టణ వాసులపై చెత్త పన్ను భారం తొలగింది. చెత్త తొలగింపునకు గత వైకాపా ప్రభుత్వం పన్ను విధించిన విషయం తెలిసిందే. దీనిని చెల్లించలేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే వారు. తాము అధికారంలోకి వస్తే పన్ను భారం తొలగిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చెత్త పన్నును రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నిడదవోలు పట్టణంలో సుమారు 10,873 నివాస గృహాలున్నాయి. తొలుత 4వ సచివాలయ పరిధిలోని 1, 28వ వార్డులను నమూనాగా ఎంపిక చేసి కుటుంబానికి నెలకు రూ.90 చొప్పున వసూలు చేయాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఇది ప్రజలకు భారం కావడంతో నెలకు రూ.60లు చొప్పున వసూలు చేయాలని కౌన్సిల్ నిర్ణయించింది. ఈ విధంగా 8 నెలల సమయంలో మూడు నెలలు మాత్రం బాగానే సాగింది. ఆ సమయంలో రూ.1.20 లక్షల వరకు పురపాలక సంఘానికి ఆదాయం సమకూరింది. అయితే అప్పట్లో సుమారు 55 నుంచి 60 శాతం కుటుంబాలు మాత్రమే


నిడదవోలులో రోడ్డు పక్కన వ్యర్థాలు

చెల్లించాయి. అనంతరం ప్రజల నుంచి అంత సుముఖత లేకపోవడంతో ఇచ్చిన వారి నుంచి మాత్రమే వసూలు చేసేవారు. ప్రస్తుతం ప్రభుత్వం ఈ చెత్తపన్నును పూర్తిగా రద్దు చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ చెత్త పన్నును నిడదవోలులో పట్టణమంతా అమలు చేసి ఇంటికి నెలకు రూ.60 చొప్పున వసూలు చేస్తే ప్రజలపై రూ.6.52 లక్షల వరకు భారం పడేది.. ప్రస్తుత ప్రభుత్వం ముందు చూపుతో చెత్తపన్నును రద్దు చేసింది.

● కొవ్వూరు పట్టణంలో 23 వార్డులలో సుమారు 41 వేల మంది జనాభా నివసిస్తున్నారు. 13,661 ఇళ్లు, వాణిజ్య దుకాణాలు 760 ఉన్నాయని మ్యాపింగ్ చేశారు. వీటన్నింటికి చెత్త పన్ను విధిస్తే ప్రతి నెలా రూ.7,21,050 సమకూరుతుందని అధికారులు లెక్కలు వేశారు. నమూనాగా తొలి విడతలో 11, 22 వార్డులను ఎంపిక చేశారు. వీటి పరిధిలో 2002 ఇళ్లు, వ్యాపార దుకాణాలు 63 వరకు ఉన్నాయి. వార్డుకు నలుగురు చొప్పున కార్మికులను నియమించి ప్రత్యేక పారిశుద్ధ్య పనులు అప్పగించినా నిర్వహణ కానరాలేదు. ప్రతి నెలా ఆయా వార్డుల నుంచి రూ. 1.03 లక్షలు పన్ను రూపేణా వసూలు కావాల్సి ఉన్నా రూ.3 వేల లోపే వసూలయ్యేది. తాజాగా కూటమి ప్రభుత్వం చెత్త పన్ను రద్దు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంచి నిర్ణయం...



పట్టణాల్లో చెత్త పన్నును రద్దు చేస్తూ ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. నిడదవోలు వంటి చిన్న పట్టణంలో చెత్త పన్ను రూపంలో నెలకు రూ.90 చెల్లించాలంటే భారమే. కూటమి ప్రభుత్వం దీనిని గుర్తించి రద్దు చేయడం అందరికీ ఆమోదయోగ్యమే. చిన్న కుటుంబాలకు మరింత ఆనందకరం.

- కొండా నిర్మల, విద్యానగర్, నిడదవోలు


ఎంపీడీవోగా వేణుగోపాలరెడ్డి

దేవరపల్లి: స్థానిక మండల పరిషత్తు అభివృద్ధి అధికారిగా ఎస్.వేణుగోపాల రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం నుంచి సాధారణ బదిలీల్లో ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా పని చేసిన ప్రభాకరరావు ఎన్టీఆర్ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

బాధ్యతల స్వీకరణ

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్తు కార్యాలయం పరిపాలనాధికారిగా వి.ఎస్ రామారావు, ఈవోపీఆర్డీగా ఆంజనేయశర్మ, డిప్యూటీ తహసీల్దార్‌గా ఎ.కనకదుర్గ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. మోర్త వీఆర్వోగా వి.రామకృష్ణ, సత్యవాడలో జె.వెంకటనరసమ్మ, చివటంలో పి.రామలింగేశ్వరరావు, దమ్మెన్నులో ఆర్ఎన్‌వీ లక్ష్మి, ఉండ్రాజవరం వీఆర్వోగా తణుకు శ్రీనివాసు బాధ్యలు స్వీకరించారు.

దేవరపల్లి: మండలంలో అయిదుగురు కార్యదర్శులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. దేవరపల్లి కార్యదర్శిగా నిట్టా రవికిషోర్, యర్నగూడేనికి అమ్మిరాజు, చిన్నాయిగూడేనికి ఎం.రాణి, యాదవోలుకు ప్రసాద్, గౌరీపట్నానికి నజీర్ బాధ్యతలు స్వీకరించారు.


విశేషాలంకరణలో కొవ్వూరు జ్ఞానసరస్వతిదేవి






తాళ్లపూడి, కె.సావరం, గోపాలపురంలలో గాయత్రీ దేవిగా...


దేవరపల్లి మూడు బొమ్మల సెంటర్‌లో పూజలు

జగజ్జననీ.. పాహిమాం

దేవీ నవరాత్రి మహోత్సవాలు రెండో రోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లను వివిధ అలంకరణల్లో కొలువుదీర్చి విశేషార్చనలు


నిడదవోలులో సహస్రనామ పూజలు చేస్తున్న భక్తులు

చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వాడపల్లి శ్రీపుట్టాలమ్మ, నంగాలమ్మ ఆలయాలను మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. క్షేత్రంలో జ్ఞాన సరస్వతిదేవి, శ్రీపురుషోత్తమ రామ మందిరంలో త్రిశతి చండీ సహిత రుద్రయాగం, క్షేత్రంలో బాలా త్రిపురసుందరి, లలితా పార్వతీదేవి, ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కన్యకాపరమేశ్వరికి అభిషేకం, సహస్ర నామార్చన, సామూహిక కుంకుమార్చనలు చేశారు. మహిళా భక్తులు లలితా సహస్రనామ పారాయణ, భజన కార్యక్రమాలు కొనసాగించారు. కుమారదేవం గండి పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ ఆలయంలో రెండో రోజు 347 మంది దంపతులు ప్రత్యేక సహస్రనామ పూజల్లో పాల్గొన్నారు. ఆ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మంత్రి కందుల దుర్గేష్ పట్టణంలోని పలు దేవి మండపాలను సందర్శించారు.

- న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం, చాగల్లు, తాళ్లపూడి, నిడదవోలు, పెరవలి, ఉండ్రాజవరం, గోపాలపురం, నల్లజర్ల, దేవరపల్లి


ఉండ్రాజవరంలో పూజలందుకున్న గండి పోశమ్మ తల్లి

గమ్యం లేకుండా వెళుతున్న బాలిక సదనానికి తరలింపు

కొవ్వూరు పట్టణం: గమ్యం లేకుండా వెళుతున్న ఓ బాలికను పోలీసులు బాల సదనానికి అప్పగించారు. వివరాల ప్రకారం.. రోడ్ కం రైలు వంతెనపై శుక్రవారం ఉదయం పదేళ్ల వయస్సు గల బాలిక కొవ్వూరు వైపు నడుచుకుంటూ వెళుతుండగా అటుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న సచివాలయ కార్యదర్శి తేజ చూసి ఎవరమ్మా, ఎక్కడికి వెళుతున్నావని అడగ్గా వంతెన దాటితే మా ఊరొస్తుందని చెప్పడంతో వాహనం ఎక్కించుకుని టోల్‌గేటు వరకు తీసుకొచ్చారు. మీ ఇల్లు ఎక్కడ అని అడిగితే సరైన సమాధానం చెప్పకపోవడంతో పట్టణ స్టేషనులో అప్పగించారు. సీఐ విశ్వం బాలికతో మాట్లాడగా తన పేరు కాకరి మోక్షితని, అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం దొంతురాయి అని, కొన్నాళ్లుగా రాజమహేంద్రవరంలో ఉంటున్నానని వివరించింది. దీంతో ఆయన ఐసీడీఎస్ సూపర్‌వైజరు విజయలక్ష్మి, సిబ్బంది ద్వారా బాలికను రాజమహేంద్రవరంలోని బాలసదన్‌కు పంపించి, ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.


పట్టణ స్టేషన్లో అంగన్‌వాడీ సిబ్బందితో కాకరి మోక్షిత

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అధికారులంతా సమన్వయంతో పని చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలను ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో అమలు చేయాలని సూచించారు. పెండ్యాల ఎంపీటీసీ సభ్యుడు వాకా శ్రీను మాట్లాడుతూ తాను జనసేన నుంచి గెలుపొందడం వల్ల గత మూడేళ్లుగా తన కోటా కింద గ్రామాభివృద్ధికి ఒక్క గ్రాంటు కూడా ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో అనేక ఇబ్బందులు పడ్డామన్నారు. విజ్జేశ్వరం సర్పంచి తిక్కా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఎక్కడా వివక్ష లేదన్నారు. అన్ని గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయింపు జరిగిందన్నారు. దీనిపై దుర్గేష్ జోక్యం చేసుకుంటూ గత ప్రభుత్వ హయాంలో ఖచ్చితంగా వివక్ష చూపించారని దీనిలో ఏ మాత్రం అనుమానం లేదన్నారు. రాజమహేంద్రవరం రూరల్‌లో తాను ప్రత్యక్షంగా చూశానన్నారు. ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అన్ని గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించామన్నారు. దీనికి తాళ్లపాలెం సర్పంచి యర్రా రామకృష్ణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు కె.సూరిబాబు, మండల ఉపాధ్యక్షురాలు కానుబోయిన ప్రభావతి, ఎంపీడీవో శామ్యూల్, తహసీల్దారు బి.నాగరాజు నాయక్ పాల్గొన్నారు.

ఇసుక సరఫరా పునరుద్ధరణకు వినతి


ఎమ్మెల్యే వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ఇసుక ర్యాంపులను తెరిచి సరఫరాను పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు వల్లేపల్లి నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శి ఎం.సుందరబాబు కోరారు. కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్న డిమాండుతో సీఐటీయు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రదర్శన చేపట్టారు. బస్టాండు కూడలి నుంచి ప్రదర్శనగా వెళ్లి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఇసుక సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో భవన నిర్మాణ కార్మికులు ఉపాధిని కోల్పోయి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. కొత్త విధానం ప్రకటిస్తామని చెప్పి మూడు నెలలైనా అన్ని ర్యాంపులను పునరుద్ధరించలేదన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు 1214ను రద్దు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి మాట్లాడుతూ ఉచిత ఇసుక సక్రమంగా అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. గత పాలకులు ఇసుకను దోచుకోవడం, వరుసగా గోదావరికి వరదలు రావడంతో ఇబ్బందులు ఎదురయ్యాయన్నారు. పడవ యజమానులు, ప్రజలు, కార్మికులకు ఇబ్బంది లేకుండా ఇసుక సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమానికి కార్మిక సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు మైగాపుల నాగేశ్వరరావు, కోశాధికారి ఆంజనేయులు, ఎస్కే ఆదాము, తోట సూర్యారావు, ఎం.హరిబాబు, ఎం.శ్రీను, జొన్నల రాంబాబు తదితరులు నాయకత్వం వహించారు.

గ్రామాల్లో రూ. 21 కోట్లతో అభివృద్ధి పనులు


చీపురుగూడెంలో సీసీ రోడ్డు నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెంకటరాజు

నల్లజర్ల, న్యూస్‌టుడే: గోపాలపురం నియోజకవర్గంలోని 85 గ్రామాల్లో రూ.21 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు తెలిపారు. మండలంలోని చీపురుగూడెం, కవులూరు, పోతవరం, సుభద్రపాలెం, పోతినీడుపాలెం, చాదరాశిగుంట, నభీపేట, తూర్పు, పశ్చిమ చోడవరం, తెలికిచెర్ల గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే 56 గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించామని, మిగతా గ్రామాల్లో త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. గత వైకాపా ప్రభుత్వం కనీసం డ్రెయిన్లలో పూడిక కూడా తీయించలేదన్నారు. జగన్ ప్రభుత్వం పంచాయితీలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. అనంతపల్లిలోని 22వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన గర్భిణులకు సీమంతాలు కార్యక్రమంలోను ఆయన పాల్గొన్నారు. తెదేపా మండలశాఖ అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, ఏలేటి సత్యనారాయణ, రావూరి రమణ, వల్లూరి సత్తిపండు, కూచిపూడి ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఉద్యోగులకు స్థాన చలనం

చాగల్లు: చాగల్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో నిర్మలాకుమారి తాళ్లపూడి మండల అడ్మినిస్ట్రేటివ్ అధికారిణిగా బదిలీ అయ్యారు. చాగల్లు పంచాయతీ కార్యదర్శి ఎల్.రవికుమార్ కొయ్యలగూడెం మండలం కన్నాపురం, బ్రాహ్మణగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.రాకేష్ శరత్ కలవలపల్లి బదిలీ అయ్యారు. కలవలపల్లి కార్యదర్శి వి.అనురాధ గోపాలపురం బదిలీ అయ్యారు.

బదిలీపై వెళుతున్న ఎంపీడీవోకు సత్కారం

గోపాలపురం, న్యూస్‌టుడే: ఎంపీడీవోగా ఆర్.శ్రీదేవి అయిదేళ్లపాటు మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ కొనియాడారు. ఆమె బదిలీపై చాగల్లు మండలానికి వెళుతున్న సందర్భంగా శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, తెదేపా మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, వివిధ పార్టీల నాయకులు, మండల పరిషత్తు కార్యాలయ సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి.. ఆపై పల్టీకొట్టి

✦ ఒకరికి తీవ్ర గాయాలు ✦ రాజమహేంద్రవరం తరలింపు

నల్లజర్ల, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై రాజమహేంద్రవరం వైపు వెళుతున్న ఓ కారు ద్విచక్ర వాహన చోదకుడిని వెనుక నుంచి ఢీకొట్టి.. ఆపై పల్టీకొట్టి విభాగినిపైకి చేరింది. ఈ ఘటన అనంతపల్లి శివారులోని వీరవల్లి టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. హైవే పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణంగూడేనికి చెందిన చొదమళ్ల శ్రీను ద్విచక్ర వాహనంపై టోల్ ప్లాజా వద్దకు వెళుతుండగా ఏలూరు నుంచి రాజమహేంద్రవరం వైపునకు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టి అదే వేగంతో వెళ్లి విభాగినిపై బోల్తా పడింది. ఈ ఘటనలో శ్రీనుకు తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడ నుంచి రాజమహేంద్రవరం తరలించారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురు క్షేమంగా బయటపడ్డారు.


విభాగినిపై పల్టీ కొట్టిన కారు

ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలి


నిరసన తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

నిడదవోలు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు తీరి 4 నెలలు కావస్తున్నా కార్మిక వర్గానికి ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టకుండా మీనామేషాలు లెక్కిస్తుందని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ అన్నారు. నిడదవోలు ఇందిరానగర్‌లో ఐఎఫ్‌టీయూ అనుబంధ అభ్యుదయ పెయింటర్స్ అండ్ ఆర్టిస్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రవ్వ రమేష్‌కుమార్, నాయకులు గుంటు సూరిబాబు, జగదీష్, యెల్లమిల్లి ప్రసన్న, యాదాల రమణ, అశోక్, రాజీవ్, రాజ్‌పాల్, మహేష్, యాదాల ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఉపాధి కరవు..

ప్రజలకు ఉచితంగా ఇసుక అందిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ గాలికి వదిలేసిందని సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిడదవోలులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. గత 4 నెలలుగా ఇసుక విధానం వల్ల భవననిర్మాణ కార్మికులకు ఉపాధి అవకాశాలు లేవని రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.గోపి, జి.డానియల్, జి.రాంబాబు, డి.మునియ్య, టి.నరేష్, ఎం.రాము, రాజు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

7న బస్సు పాసులు అందజేత

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు ఆర్టీసీ డిపో పరిధిలో ఈ నెల 5, 6వ తేదీల్లో సాంకేతిక ఇబ్బందుల కారణంగా బస్సు పాసులు ఇవ్వడం లేదని డిపో అధికారులు తెలిపారు. ఈనెల 7న బస్సుపాసులు కౌంటర్‌లలో యథావిధిగా అందిస్తామన్నారు. ఈ మార్పును గమనించాలని ఈసందర్భంగా కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నిడదవోలు, న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ వ్యక్తి ఒకరు శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు సమిశ్రగూడెం పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామానికి చెందిన గుడెల్లి సతీష్(22) అనే వ్యక్తి జీడిగింజల వ్యాపారం చేస్తున్నారు. అందులో నష్టం రావడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఈనెల ఒకటిన కలుపు మందు తాగినట్లు తెలిపారు. తొలుత రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడ నుంచి కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. దీనిపై మధ్యాహ్నం అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు పట్టణంలోని లింగంపల్లిలో గురువారం రాత్రి నలుగురిపై చాకుతో దాడిచేసి గాయపరిచిన సంఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు నిడదవోలు పోలీసులు శుక్రవారం తెలిపారు. గుంటు సునీల్, గుంటు అనిల్, గుంటు వంశీకృష్ణ(మోషే)లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. గాయపడిన వారు చికిత్స పొందుతున్నారన్నారు.

స్వచ్ఛ సంకల్పం.. పూర్తి నిర్లక్ష్యం

రెండేళ్లైనా అందుబాటులోకి రాని రిక్షాలు

న్యూస్‌టుడే, దేవరపల్లి

అయిదేళ్ల వైకాపా పాలనలో గ్రామ స్వరాజ్యం కలలు కల్లలయ్యాయి. పల్లెల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచి పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలన్న సంకల్పం నీరుగారింది. సంపద కేంద్రాలు ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారాయి. పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితుల్లో.. సంపద కేంద్రాలకు చెత్త తరలించేందుకు వీలుగా సమకూర్చిన రిక్షాలు తుప్పుపట్టిపోతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పరిస్థితులు మారుతాయని సంపద కేంద్రాలు అందుబాటులోకి రావడంతోపాటు పల్లెల్లో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడతాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల పరిధిలోని ఒక్కో సచివాలయానికి గతంలో మూడేసి చొప్పున 496 రిక్షాలు పంపిణీ చేశారు. ఇళ్ల నుంచి సేకరించిన తడి, చెత్త పొడి చెత్త వీటిపై సంపద తయారీ కేంద్రాలకు తరలించాలి. వర్మీకంపోస్ట్ తయారు చేసి రైతులకు విక్రయించి సంపద సృష్టించాలని భావించినా క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చలేదు. రిక్షాలకు పెద్ద పరిమాణంలోని టైర్లు అమర్చడంతో వాటిని తొక్కేందుకు పారిశుద్ధ్య కార్మికులు ముందుకు రావడం లేదు. అధికారులు పట్టించుకోకపోవడంతో అవి ఎండకు ఎండి, వానకు తడిసి తుప్పు పట్టి మూలకు చేరాయి. మరికొన్ని పంచాయతీల్లో వాటిని ఒక్కసారి కూడా ఉపయోగించలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రిక్షాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకుని రావాలని ప్రజలు కోరుతున్నారు.


యర్నగూడెం పంచాయతీ ఆవరణలో నిరుపయోగంగా రిక్షాలు


దేవరపల్లి-పల్లంట్ల రహదారిలో పేరుకుపోయిన వ్యర్థాలు

వినియోగంలోకి తీసుకొస్తాం..

సర్పంచులు, కార్యదర్శులతో తీర్మానాలు చేయించి రిక్షాలు, ఆటోలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తాం. గ్రామసభల్లో ప్రత్యేకంగా పారిశుద్ధ్య సమస్యలు, సంపద తయారీ కేంద్రాలపైనే చర్చలు జరుపుతున్నాం. పారిశుద్ధ్య సమస్యల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, రిక్షాలు వినియోగించకుండా మూలనపెట్టిన కార్యదర్శులపై కఠినమైన చర్యలు తీసుకుంటాం.

- వై.అమ్మాజీ, డీఎల్‌పీవో, కొవ్వూరు